



రాజీవ్ యువ వికాసానికి దరఖాస్తుల వెల్లువ

ధ్రువీకరణ పత్రాల జారీలో తీవ్ర జాప్యం

తిమ్మాపూర్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): రాజీవ్ యువ వికాసం పథకానికి మండలంలో భారీ స్పందన వస్తోంది. ఈ పథకం దరఖాస్తుకు కుల, ఆదాయ, నివాస ధ్రువీకరణ పత్రాలు తప్పనిసరి కావడంతో వాటి కోసం మీసేవ కేంద్రాలు, తహసీల్దార్ కార్యాలయాల వద్ద యువత బారులు తీరుతున్నారు. రాజీవ్ యువ వికాసం గడువును రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 14 వరకు పొడిగించింది.

సర్వర్‌లో ఇబ్బందులు..

రాజీవ్ యువ వికాసం పథకానికి దరఖాస్తు చేసుకునేందుకు నిరుద్యోగ యువత మీ సేవ కేంద్రానికి వెళ్లిన, ధ్రువీకరణ పత్రాల కోసం యువతకు నిరీక్షణ తప్పడం లేదు. సర్వర్ స్లో కావడం సమస్యగా మారింది. దీంతో ధ్రువపత్రాల అప్‌లోడింగ్‌కు చాలా సమయం తీసుకుంటోంది. రోజుకు వందల సంఖ్యలో ధ్రువీకరణ పత్రాల కోసం యువత దరఖాస్తు చేసుకుంటున్నారు. వందల సంఖ్యలో దరఖాస్తులు వస్తే పదుల సంఖ్యలో మాత్రమే పత్రాలు జారీ అవుతున్నాయి. తిమ్మాపూర్ మండలంలో 3,371 దరఖాస్తులు వస్తే 1,841 ధ్రువీకరణ పత్రాలు మాత్రమే జారీ అయ్యాయి. ఇంకా 1,530 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. ఇప్పటి వరకు మండల వ్యాప్తంగా రాజీవ్ యువ వికాస పథకాని 331 దరఖాస్తులు వచ్చాయి. దరఖాస్తు చేసుకునేందుకు ఈ నెల 14 వరకు గడువు ఉంది.

సర్టిఫికెట్లు త్వరగా అందించేందుకు ప్రయత్నిస్తున్నాం..

విజయ్‌కుమార్, తహసీల్దార్




రోజుకు 300కుపైగా ధ్రువీకరణ పత్రాలకు దరఖాస్తులు వస్తున్నాయి. వాటి ప్రక్రియ త్వరగా పూర్తి చేసి ఇచ్చేందుకు ప్రయత్నిస్తున్నాం. ఒక్క సర్టిఫికెట్ జారీకి అన్‌లైన్‌లో గతంలో 5 నిమిషాలు పట్టేది. ప్రస్తుతం 15 నుంచి 20 నిమిషాల సమయం తీసుకుంటుంది.

ఎస్సీ, ఎస్టీ సంక్షేమంలో జిల్లా ముందంజ

- సమస్యల పరిష్కారంలో అశ్రద్ధ చేస్తే కఠిన చర్యలు
- రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య

కరీంనగర్ టౌన్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ, ఎస్టీలకు అమలు చేస్తున్న సంక్షేమ పథకాల్లో జిల్లా ముందంజలో ఉందని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య ప్రశంసించారు. గురువారం ఆయన కలెక్టరేట్‌లో అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. అనంతరం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ సమస్యలపై అశ్రద్ధవహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు. రూల్ ఆఫ్ రిజర్వేషన్లను కచ్చితంగా అమలు చేయాలని ఆదేశించారు. ఉద్యోగాల భర్తీ, పదోన్నతుల్లో రోస్టర్ రిజర్వేషన్ పాటించాలన్నారు. అధికారులు ప్రజలతో సత్సంబంధాలు కలిగి ఉండాలని సూచించారు. ఎస్సీ, ఎస్టీ భూముల సమస్యల భూమాత పోర్టల్ ద్వారా పరిష్కారమవుతాయన్నారు. సమావేశంలో ఎస్సీఎస్టీ కమిషన్ సభ్యులు కుస్రం నీలాదేవి, కొంకటి లక్ష్మీనారాయణ, జిల్లా శంకర్, రేణిగుంట్ల ప్రవీణ్, రాంబాబునాయక్ పాల్గొన్నారు.




లైట్లు వెలగకపోవడంతో చీకటిగా ఉన్న తీగలవంతెన

ఏవీ ఆ వెలుగులు..?

- అలంకారప్రాయంగా తీగలవంతెన డైనమిక్ లైటింగ్ సిస్టమ్
- ఏడాది తిరగకముందే శిథిలమైన రోడ్లు
- పట్టించుకోని ప్రజాప్రతినిధులు, అధికారులు

కరీంనగర్ టౌన్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ మానేరునదిపై నిర్మించిన తీగలవంతెన (కేబుల్ బ్రిడ్జి) ఏడాది తిరక్కముందే కళావిహీనంగా మారింది. కేబుల్ బ్రిడ్జి అప్రోచ్ రోడ్లు ఏడాదిలోపే రెండుసార్లు దెబ్బతిన్నాయి. వాటికి మరమ్మతులు పైపైనే చేసి చేతులు దులుపుకోవడంతో మళ్లీ రోడ్డు అధ్వాన్నంగా మారింది. బ్రిడ్జిపై ఇప్పటికే రెండు మూడు సార్లు రోడ్డు వేసినా నిలవడం లేదు. 6.5 కోట్లతో బ్రిడ్జిపై ఏర్పాటు చేసిన డైనమిక్ లైటింగ్ సిస్టమ్ పని చేయడం లేదు. బ్రిడ్జి నిర్మించిన కొత్తలో రాత్రి వేళల్లో రంగురంగుల లైట్లతో కళ్లు మిరిమిట్లు గొలపడంతో నగరవాసులు సెల్ఫీలు దిగేందుకు పోటీపడేవారు. ఒకటిరెండు సార్లు ఆదివారాల్లో వంతెనపై వాహనాలను వెళ్లకుండా దారి మళ్లించి వీకెండ్ ప్రోగ్రామ్స్‌ను నిర్వహించారు. ఈ వైభవం ఏడాది తిరగక ముందే మసక బారిపోయింది.

నిర్వహణను పట్టించుకోని అధికారులు

కేబుల్ బ్రిడ్జి నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలను పాటించక పోవడం, నిర్వహణను అధికారులు పట్టించుకోలేదు. దీంతో డైనమిక్ లైటింగ్ సిస్టమ్ దెబ్బతిన్నది. మొదట్లో ఒకటి, రెండు కేబుళ్ల లైట్లు వెలగలేదు. తర్వాత ఒక పోల్ మొత్తం లైట్లు ఆరిపోయాయి. తర్వాత కొన్ని రోజులకు బ్రిడ్జి మొత్తం లైట్లు ఆరిపోయాయి. ఇరువైపులా ఏర్పాటు చేసిన స్ట్రీట్‌లైట్ల పోల్స్ విరిగి పోయాయి. రెండు కూడళ్లలో ఉన్న లైటింగ్ పరిస్థితీ అంతే.. ఓవైపు శిథిలమైన రోడ్డు, మరోవైపు వెలుగని లైట్లతో రాత్రి వేళల్లో బ్రిడ్జిపై నుంచి వెళ్ళేందుకు ద్విచక్రవాహనదారులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. దాదాపు 200 కోట్లతో నిర్మించిన కేబుల్ బ్రిడ్జి నిర్వహణపై ఆర్‌అండ్‌బీ అధికారులు దృష్టిసారించక పోవడం దారుణమని ప్రజలు విమర్శిస్తున్నారు.

తగ్గిన ఉష్ణోగ్రతలు

చిరు జల్లులతో ఉపశమనం

కరీంనగర్ టౌన్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. గురువారం తెల్లవారుజామున నుంచి ఆకాశం మేఘావృతం కావడంతో ఉష్ణోగ్రతలు తగ్గాయి. గత వారంలో 40 డిగ్రీలకుపైన ఉష్ణోగ్రతలు నమోదు కావడంతో ఉక్కిరిబిక్కిరయ్యారు. గురువారం జిల్లాలో కనిష్ఠ ఉష్ణోగ్రతలు 22 డిగ్రీలు, గరిష్ఠంగా 34 డిగ్రీలుగా నమోదయ్యాయి. జిల్లాలోని కొన్ని ప్రాంతాల్లో చిరు జల్లులు కురిశాయి. వాతావరణంలో చోటుచేసుకున్న పరిణామాలతో రైతులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. కొద్దిరోజుల్లో వరి కోతలు మొదలయ్యే సమయంలో వడగాల్పులు, వడగళ్ల వర్షాలు కురిస్తే చేతికందివచ్చే సమయంలో పంట నష్టపోతామని ఆవేదన చెందుతున్నారు. ఉపతల ఆవర్తన ద్రోణి ప్రభావంతో 6వ తేదీ వరకు వర్షాలు పడే అవకాశం ఉందని వాతావరణశాఖ తెలిపింది.

ప్రభుత్వాసుపత్రుల్లో ప్రసవాలు పెంచాలి

డీఎంహెచ్‌వో డాక్టర్ వెంకటరమణ

సుభాష్‌నగర్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాలను పెంచాలని డీఎంహెచ్‌వో డాక్టర్ వెంకటరమణ అన్నారు. గురువారం డీఎంహెచ్‌వో కార్యాలయంలో ప్రాథమిక ఆరోగ్యకేంద్రాలు, పట్టణ ఆరోగ్యకేంద్రాలు, బస్తీ దవాఖాన వైద్యాధికారులు, ఎంఎల్‌హెచ్‌పీలతో సమీక్షా సమావేశంలో మాట్లాడుతూ 30 సంవత్సరాల పైవారికి అసంక్రమిత వ్యాధుల స్క్రీనింగ్ ఇంప్రూవ్ చేయాలని ఆదేశించారు. డీసీటీవో డాక్టర్ రవిందర్‌రెడ్డి మాట్లాడుతూ క్షయవ్యాధి నిరవారణలో అందరూ లక్ష్యాన్ని పూర్తి చేయాలన్నారు. ఎన్‌సీడీ ప్రోగ్రాం అధికారి డాక్టర్ విప్లవశ్రీ మాట్లాడుతూ అభాకార్డు క్రియేషన్ వంద శాతం పూర్తి చేయాలన్నారు. ఎంసీహెచ్‌పీవో డాక్టర్ సనాజవేరియా మాట్లాడుతూ 12 వారాల గర్భవతులందరి వివరాలు రిజిస్ట్రేషన్ చేయించాలన్నారు. డీఐవో డాక్టర్ సాజిదఅతహరి మాట్లాడుతూ పిల్లల వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని వందశాతం పూర్తి చేయాలన్నారు.

'బీసీ స్టడీ సర్కిల్ ఎత్తివేతకు కుట్ర'

గణేశ్‌నగర్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): అనేక పోరాటాలు చేసి జిల్లాలో బీసీ స్టడీ సర్కిల్‌ను ఏర్పాటు చేసుకుంటే దానిని ఎత్తివేయడానికి కుట్రలు చేస్తున్నారని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేశిపెద్ది శ్రీధర్ రాజు ఆరోపించారు. గురువారం ఆయన బీసీ స్టడీ సర్కిల్‌ను సందర్శించిన అనంతరం విలేకరులతో మాట్లాడారు. బీసీ సంఘాల ఆధ్వర్యంలో పోరాటం చేసి మహబూబ్‌నగర్ జిల్లా నుంచి కరీంనగర్‌కు స్టడీ సర్కిల్‌ను తీసుకొచ్చామన్నారు. గత ప్రభుత్వ హయాంలో ఉజ్వల పార్క్ సమీపంలో ఎకరం భూమిలో ఐదు కోట్ల వ్యయంతో పక్కా భవనాన్ని నిర్మించారన్నారు. అలాంటి భవనాన్ని పూర్తిగా స్టడీ సర్కిల్‌కు వినియోగించకుండా బీసీ గురుకుల పాఠశాలను ఏర్పాటు చేశారన్నారు. బీసీ స్టడీ సర్కిల్‌ను అక్కడి నుంచి ఎత్తివేసేందుకు కుట్రలు పన్నుతున్నారని ఆరోపించారు. ఈ ప్రయత్నాన్ని విరమించుకోవాలని, బీసీ గురుకుల పాఠశాలకు మరొక సొంత భవనాన్ని నిర్మించాలని కోరారు.

తగ్గిన బీరు జోరు..

జిల్లాలో పడిపోయిన అమ్మకాలు.

ధరల పెరుగుదలనే కారణమా?




కరీంనగర్ క్రైం, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో బీరు అమ్మకాలు ఫిబ్రవరి, మార్చి నెలల్లో భారీగా తగ్గాయి. గత ఏడాదితో పోల్చితే మార్చి నెలలో 46,791 వేల పెట్టెల బీరు అమ్మకాలు తగ్గిపోయాయి. ఇది 27.44 శాతం. 2024 మార్చి నెలలో జిల్లా వ్యాప్తంగా 1,70,551 పెట్టెల బీరు అమ్మకాలు సాగగా, ఈ సంవత్సరం మార్చి నెలలో 1,23,760 పెట్టెలు మాత్రమే అమ్ముడుపోయింది. మార్చి నెలలో విస్కీ, బ్రాందీ అమ్మకాలు 11.11 శాతం వరకు పెరిగాయి. ఫిబ్రవరిలో బీరు ధరలను ప్రభుత్వం పెంచింది. ఇది బీరు అమ్మకాలు పడిపోవడానికి ఓ కారణమని ఎక్సైజ్ అధికారులు, మద్యం వ్యాపారులు అంటున్నారు. సాధారణంగా వేసవి కాలంలో ఎండ తీవ్రతతో మద్యం ప్రియుల చూపు బీరుపై పడుతుంది. వేసవి తాపం నుంచి ఉపశమనం పొందటానికి కొందరు కూల్‌డ్రింక్స్, కొబ్బరి బొండాలు, చెరకు రసం తాగుతారు.

మద్యం ప్రియులు మాత్రం బీరును ఆస్వాదిస్తారు. ఎండ వేడి నుంచి తప్పించుకునేందుకు కూల్ కూల్‌గా... హాయి హాయిగా బీరు సేవించడమే మంచి మార్గమని మద్యం ప్రియులు చెబుతుంటారు. సాధారణంగా ప్రతి సంవత్సరం విస్కీ, బ్రాంది అమ్మకాలు తగ్గి, బీరు అమ్మకాలు పెరుగుతుంటాయి. జిల్లాలో ఈ ఏడాది అనూహ్యంగా బీరు అమ్మకాలు తగ్గిపోయాయి. దీంతో ఎక్సైజ్ అధికారులు నిర్దేశించుకున్న లక్ష్యం కంటే వెనుకబడిపోయారు.

● మద్యం డిపోలో..:

కరీంనగర్ మద్యం డిపో నుంచి కరీంనగర్, జగిత్యాల, పెద్దపల్లి జిల్లాలకు చెందిన 192 వైన్స్, 58 బార్లకు మద్యం సరఫరా అవుతుంది. మద్యం డిపోలోనూ మార్చి నెలలో బీరు అమ్మకాలు గణనీయంగా తగ్గిపోయాయి. 2024లో 3,52,00 పెట్టెల బీరు అమ్ముడుపోగా 2025 మార్చిలో 2.5 లక్షల పెట్టెల అమ్మకం జరిగింది. గత ఏడాది 61 కోట్ల రూపాయల విలువైన బీరు అమ్మకం జరగగా ఈ ఏడాది 10 కోట్లు అమ్మకాలు తగ్గిపోయి 51 కోట్ల రూపాయల బీరు అమ్మకాలు మాత్రమే జరిగాయి.



ఇంటిగ్రేటెడ్ మార్కెట్లను రైతులకు అప్పగించాలి


సమావేశంలో మాట్లాడుతున్న కూరగాయల రైతుల జేఏసీ ప్రతినిధి చంద్రారెడ్డి, సభ్యులు

కరీంనగర్ టౌన్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): నగరంలో నిర్మించిన ఇంటిగ్రేటెడ్ మార్కెట్లను ఈ నెలాఖరులోగా రైతులకు అప్పగించి అందులో కూరగాయలు అమ్ముకునేందుకు దుకాణాలను కేటాయించాలని ఆకుకూరల, కూరగాయల రైతుల జేఏసీ ప్రతినిధులు అధికారులను కోరారు. గురువారం నగరంలోని ఫిలింభవన్‌లో విలేకరుల సమావేశంలో రైతుల జేఏసీ ప్రతినిధి జంగ చంద్రారెడ్డి మాట్లాడుతూ 30 రోజుల్లో రైతుల జాబితాను సిద్ధం చేసి ఇస్తామని, దాని ప్రకారంగా దుకాణాలను కేటాయించాలని కోరారు. కరీంనగర్ మార్కెట్‌కు కొంత మంది అడ్డీ వ్యాపారులు, కమీషన్ ఏజెంట్లు ఇతర రాష్ట్రాల నుంచి కూరగాయలు, ఆకుకూరలను తీసుకువస్తున్నారన్నారు. వాటిని ఇక్కడ విక్రయిస్తుండడంతో స్థానికంగా కూరగాయలు, ఆకుకూరలు సాగు చేసే రైతులు నష్టపోతున్నారని తెలిపారు. స్థానిక రైతులను ప్రోత్సహించేందుకు ఇతర ప్రాంతాల నుంచి కూరగాయల తెస్తున్న ఏజెంట్ల, అడ్డీ వ్యాపారులను కట్టడి చేయాలని కోరారు. రైతుల నుంచి కూడా ఫీజులను వసూలు చేసి మార్కెట్ల అభివృద్ధికి వాటిని ఖర్చు చేయాలని సూచించారు. ప్రభుత్వ హాస్టళ్లకు రైతుల నుంచే కూరగాయలు కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో జేఏసీ ప్రతినిధులు ఆకుల లింగయ్య, దావు మహిపాల్‌రెడ్డి, ఆరెల్లి శ్రీనివాస్, పుల్లెల జగన్, బెజ్జంకి అజయ్ పాల్గొన్నారు.

నేటి నుంచి జిల్లా ఆసుపత్రి కార్మికుల సమ్మె

సుభాష్‌నగర్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): కార్మికుల పెండింగ్ జీతాలు చెల్లించాలని కోరుతూ జిల్లా ఆసుపత్రి కార్మికులు శుక్రవారం నుంచి సమ్మె చేస్తున్నట్లు ప్రభుత్వ ఆసుపత్రి వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ గౌరవాధ్యక్షుడు బండారి శేఖర్ తెలిపారు. జిల్లా ఆసుపత్రి ఆవరణలో కార్మికులతో కలిసి గురువారం సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికులకు మూడు నెలలుగా జీతాలు పెండింగ్‌లో ఉన్నాయని, వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రతినెల 5వ తేదీలోపు జీతాలు ఇవ్వాలని, ఇతర సమస్యలు పరిష్కరించాలని 14 రోజుల క్రితం ఆసుపత్రి సూపరింటెండెంట్‌కు సమ్మె నోటీసు అందజేశామని తెలిపారు. స్పందించకపోవడంతో సమ్మెకు వెళుతున్నామన్నారు. సమావేశంలో అధ్యక్షుడు పి ఆరుణ్, కార్యదర్శి కళావతి పాల్గొన్నారు.

అక్రమ అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరు

భగత్‌నగర్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): అక్రమ అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి గజ్జెల శ్రీకాంత్ అన్నారు. హైదరాబాద్‌లోని హెచ్‌సీయూ భూముల వేలాన్ని నిరసిస్తూ చలో సెక్రటేరియట్‌కు వెళ్లేందుకు సిద్ధమవుతున్న విద్యార్థి సంఘాల నాయకులను పోలీసులు ముందస్తు అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హెచ్‌సీయూలోని 400 ఎకరాల భూమిని యూనివర్సిటీకే కేటాయించాలని, అరెస్టు చేసిన విద్యార్థులకు ప్రభుత్వం బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. అరెస్టయిన నాయకుల్లో తిప్పారపు రోహిత్, నవీన్, పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి మారుతి, ఏఐఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రామారపు వెంకటేష్‌య మచ్చ రమేష్ ఉన్నారు.

దొడ్డి కొమురయ్య పోరాటం స్ఫూర్తిదాయకం


దొడ్డికొమురయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య, కలెక్టర్ పమేలాసత్పతి

కరీంనగర్ టౌన్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): భూమి కోసం, భుక్తి కోసం, వెట్టిచాకిరి విముక్తి కోసం పోరాటం చేసి అమరుడైన దొడ్డి కొమురయ్య పోరాటం భావితరాలకు స్ఫూర్తిదాయకమని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య, కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. గురువారం స్థానిక కలెక్టరేట్ ఆడిటోరియంలో దొడ్డి కొమురయ్య 98వ జయంతిని జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో సీపీ గౌస్ ఆలం, ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యులు కుస్రం నీలాదేవి, కొంకటి లక్ష్మీనారాయణ, జిల్లా శంకర్, రేణిగుంట్ల ప్రవీణ్, రాంబాబు నాయక్ పాల్గొన్నారు.

చకచకా పెద్దపల్లి రైల్వే బైపాస్

పూర్తయిన ఇంటర్ లాకింగ్ పనులు

త్వరలో అందుబాటులోకి రైల్వే లైన్

(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

పెద్దపల్లి రైల్వే బైపాస్ పనులు చకచకా జరుగుతున్నాయి. మార్చి నెలాఖరులో పెద్దపల్లి నుంచి కొలనూర్ రైల్వేస్టేషన్ల మధ్య ఇంటర్ లాకింగ్ పనులు పూర్తి చేసిన రైల్వే శాఖాధికారులు త్వరలోనే ఈ లైన్‌ను అందుబాటులోకి తీసుకువచ్చేందుకు ముమ్మరంగా పనులు చేపడుతున్నారు. ముందుగా గూడ్స్ రైళ్లను అనుమతించి ఆ తర్వాత ప్యాసింజర్ రైళ్లను అనుమతించాలని అధికారులు భావిస్తున్నారు. ఈ బైపాస్ లైన్ నిర్మాణంతో భవిష్యత్తులో కరీంనగర్, నిజామాబాద్ మీదుగా ముంబాయికి రైళ్లు నడిచేందుకు అవకాశాలున్నాయి. ప్రస్తుతం కరీంనగర్ నుంచి తిరుపతికి వెళుతున్న రైలు, నిజామాబాద్ నుంచి కాకినాడ పోర్టుకు వెళ్లాల్సిన గూడ్స్ రైళ్లు పెద్దపల్లి రైల్వే స్టేషన్‌లో 40 నిమిషాల పాటు ఆగాల్సి వస్తున్నది. బైపాస్‌తో సమయం ఆదా కానున్నది. బైపాస్ లైన్ పూర్తయితే తర్వాత రైళ్లు పెద్దపల్లి రైల్వే జంక్షన్‌కు వెళ్లకుండానే బైపాస్ గుండా నేరుగా వెళ్లవచ్చు. ఈ లైన్‌కు సుమారు 80 కోట్ల రూపాయల వరకు వెచ్చించారు. బైపాస్ లైన్‌ను కాజీపేట-బల్లార్షా లైన్‌కు అనుసంధానం చేశారు. చీకురాయి వద్ద రైల్వే క్యాబిన్‌ను నిర్మించారు. ఈ క్యాబిన్ నుంచి రైళ్ల రాకపోకలను అనుసంధిస్తారు. పెద్దపల్లి- నిజామాబాద్ సెక్షన్ నుంచి వచ్చే ప్యాసింజర్, గూడ్స్ రైళ్లను కాజీపేట- బల్లార్షా లైన్‌పైకి వెళ్లేందుకు సిగ్నల్స్ ద్వారా అనుసంధినిస్తారు. మార్చి నెలాఖరు వరకు ఇంటర్ లాకింగ్ పనులు పూర్తయ్యాయి. విద్యుత్ లైన్లు చివరి దశలో ఉన్నాయి. ఈ బైపాస్ నిర్మాణాన్ని సింగిల్ లైన్‌లో చేపట్టగా, డబుల్ లైన్ కోసం రైల్వే శాఖ టెండర్లను ఆహ్వానించింది. టెండర్లు పూర్తయి ఒప్పందాలు పూర్తయిన తర్వాత పనులు జరిగే అవకాశాలున్నాయి. డబుల్ లైన్‌కు సరిపడా ముందస్తుగానే భూసేకరణ పూర్తి చేశారు.


చీకురాయి వద్ద ఏర్పాటు చేస్తున్న పెద్దపల్లి రైల్వే బైపాస్

కూరగాయల వ్యాపారి ఆత్మహత్య

సిరిసిల్ల క్రైం, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల పట్టణంలోని ఇందిరానగర్‌కు చెందిన ఎర్రం కొండయ్య(57) అనే కూరగాయల వ్యాపారి సాయిబాబా దేవాలయం ఎదురుగా ఉన్న చెట్లపొదల్లో గురువారం ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. బుధవారం మధ్యాహ్నం తన భార్య పుష్పలత ఇంట్లోనుంచి ఆసుపత్రికి వెళ్లగానే కొండయ్య బయటకు వెళ్లి తిరిగిరాలేదు. సాయిబాబా దేవాలయం ఎదురుగా చెట్టుకు కొండయ్య ఉరివేసుకొని ఉండడాన్ని గురువారం స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. కూరగాయలు విక్రయించి కుటుంబాన్ని పోషించిన తన భర్త కొండయ్య అప్పులు కావడంతో మనస్తాపం చెంది బలవన్మరణానికి పాల్పడ్డాడని భార్య పుష్పలత పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు టౌన్ సీఐ కె. కృష్ణ తెలిపారు.

గుండెపోటుతో ఉపాధిహామీ కూలీ మృతి

ఇల్లంతకుంట, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పొత్తూరు గ్రామానికి చెందిన దయ్యాల లింగయ్య (70) అనే ఉపాధిహామీ కూలీ గురువారం గుండెపోటుతో మృతిచెందాడు. గ్రామస్తుల వివరాల ప్రకారం లింగయ్య ఉదయం ఉపాధిహామీ పనులు చేస్తూ గుండెపోటుకు గురయ్యాడు. వెంటనే సిరిసిల్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా గుండెపోటుతో మృతిచెందినట్లు వైద్యులు పేర్కొన్నారు. విషయం తెలుసుకున్న ఎంపీడీవో శశికళ, ఏపీవో చంద్రయ్య, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్‌లు ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి స్వగ్రామానికి మృతదేహాన్ని తరలించారు. బాధిత కుటుంబానికి ఎక్స్‌గ్రేషియా మంజూరుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లు ఎంపీడీవో తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

పెద్దపల్లిటౌన్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి):పట్టణంలోని మారుతినగర్‌లో ఒడ్డెబోయిన రాజ్‌కుమార్(40) అనుమానాస్పద స్థితిలో మృతిచెందాడు. సబ్‌స్టేషన్‌లో పని చేస్తున్న రాజ్‌కుమార్‌కు భార్య స్వాతితో వివాదాలు చోటు చేసుకున్నాయి. బుధవారం గొడవజరగడంతో తీవ్ర మనస్తాపానికి గురై అర్ధరాత్రి అనంతరం ఇంట్లో ఉరి వేసుకొన్నస్థితిలో మృతి చెందాడు. గురువారం ఉదయం రాజ్‌కుమార్ భార్య స్వాతి చింతలపల్లి, సంగెం మండలం వరంగల్ జిల్లాలో ఉంటున్న అత్త సాంబలక్ష్మికి సమాచారం ఇచ్చింది. పెద్దపల్లికి చేరుకొన్న రాజ్‌కుమార్ తల్లిసాంబలక్ష్మి మృతదేహాన్ని పరిశీలించగా తల వెనుక, కాలి వేలుకు గాయమై ఉండడాన్ని గమనించింది. సాంబలక్ష్మి ఫిర్యాదు మేరక కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై లక్ష్మన్‌రావు తెలిపారు. మృతుడికి కూతురు, కుమారుడు ఉన్నారు.

విద్యుత్‌వైరు తాకి రైతు మృతి

జగిత్యాలరూరల్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల రూరల్ మండలం పొరండ్ల గ్రామానికి చెందిన దేవి చంద్రయ్య (59) అనే రైతు తన పొలంలో తెగిపడ్డ విద్యుత్ వైరు తాకడంతో విద్యుదాఘాతంతో మృతిచెందాడు. జగిత్యాల రూరల్ ఎస్సై సధాకర్ తెలిపిన వివరాల ప్రకారం.. చంద్రయ్య వ్యవసాయ పనుల్లో భాగంగా తన వ్యవసాయ పొలం వద్దకు నడుచుకుంటూ వెళ్లాడు. ఈ క్రమంలో పొలంలో అప్పటికే తెగిపడి ఉన్న ఎల్‌టీ కరెంట్ వైరును గమనించకుండా, పొలం ఒడ్డు పైనుంచి నడుస్తుండగా విద్యుదాఘాతంతో అక్కడిక్కడే మృతిచెందాడు. మృతుడి భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఎల్‌ఎల్‌బీ ఐదో సెమిస్టర్ ఫలితాలు విడుదల

గణేశ్‌నగర్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): శాతవాహన విశ్వ విద్యాలయం పరిధిలో జనవరి 2025లో నిర్వహించిన ఎల్‌ఎల్‌బీ ఐదో సెమిస్టర్ ఫలితాలను గురువారం యూనివర్సిటీ పరీక్షల నియంత్రణ అధికారి సురేష్ కుమార్ విడుదల చేశారు. ఫలితాలు యూనివర్సిటీ వెబ్‌సైట్లో అందుబాటులో ఉన్నట్లు తెలిపారు.



లహరి బస్సుతో.. లగ్జరీ ప్రయాణం

- సౌకర్యవంతమైన సీటింగ్
- కరీంనగర్ నుంచి బెంగళూరుకు రెండు సర్వీసులు
- ఇతర ప్రాంతాలకు కేటాయించాలని విజ్ఞప్తులు

భగత్‌నగర్, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ఆధ్వర్యంలో నడుస్తున్న లహరి బస్సులతో ప్రయాణికులు లగ్జరీ ప్రయాణం చేస్తున్నారు. కరీంనగర్ రీజియన్ వ్యాప్తంగా 11 డిపోలు ఉండగా కరీంనగర్-1, గోదావరిఖని డిపోల్లో లహరి బస్సుల ఉన్నాయి. ఈ డిపోల నుంచి ప్రతీ రోజు ఒక్కో బస్సు సర్వీసును బెంగళూరుకు నడిపిస్తు న్నారు. గోదావరిఖని నుంచి సాయంత్రం 7 గంటలకు, కరీంనగర్ నుంచి ప్రతీ రోజు సాయంత్రం 5.30 గంటలకు లహరి బస్సులు బెంగళూరుకు బయల్దేరుతాయి. దూర ప్రాంతాలకు వెళ్లడానికి అనువుగా ఉండడం, సౌకర్యవంతమైన సీటింగ్, బెర్తింగ్ ఉండడంతో బెంగళూరు వెళ్లే ప్రయాణికులు లహరి బస్సులపై ఆసక్తి కనబరుస్తున్నారు.

మరిన్ని లహరి బస్సులు నడిపించాలి

దూర ప్రాంతాలకు మరిన్ని లహరి బస్సులను నడిపించాలని ప్రయాణికులు కోరుతున్నారు. ప్రస్తుతం రీజియన్ వ్యాప్తంగా రెండు మాత్రమే గోదావరిఖని, కరీంనగర్ నుంచి బెంగళూరుకు, బెంగళూరు నుంచి కరీంనగర్‌కు, గోదావరిఖనికి నడిపిస్తున్నారు. గతంలో ఉన్న మూడు ట్రిప్పుల్లో ఒకటి రద్దు చేశారు. చెన్నై, విజయవాడ, విశాఖపట్నం, ముంబాయి. తిరుపతి వంటి దూర ప్రాంతాలకు కూడా లహరి బస్సులను నడిపించాలని ప్రయాణికులు కోరుతున్నారు.


బస్సు లోపల బెర్త్‌లు


బస్సు లోపలి భాగం

స్లీపర్, సీటింగ్ సౌకర్యం

లహరి బస్సుల్లో స్లీపర్‌తోపాటు, సీటింగ్ సౌకర్యవంతంగా ఉంటాయి. దీంతో తమ ఇష్టానికి అనుగుణంగా బుకింగ్ చేసుకొంటూ ప్రయాణం చేస్తున్నారు. బస్సుల్లో స్లీపర్ బెర్త్‌లు 20, సీట్లు 22 ఉన్నాయి. ఆన్‌లైన్ రిజర్వేషన్‌తోపాటు, బస్సుల్లో సైతం టికెట్లు అందిస్తున్నారు.

డైనమిక్ ఫేర్ సిస్టం

లహరి బస్సుల్లో డైనమిక్ ఫేర్ సిస్టం అమలులో ఉండడంతో సీజన్, అన్ సీజన్‌ను బట్టి రవాణా చార్జీలు మారుతుంటాయి. బెర్తులు, సీట్లకు వేర్వేరుగా రేట్లు. బెంగళూరుకు సీటింగ్‌కు టికెట్ ధర సరాసరి రూ.1400, బెర్తుకు 2 వేల రూపాయల వరకు ఉన్నాయి.

అధిక సంఖ్యలో ప్రైవేటు బస్సులు

బెంగళూరుకు ప్రైవేట్ ఆపరేటర్లు అధిక సంఖ్యలో బస్సులు నడిపిస్తుండడం ఆర్టీసీకి ఇబ్బందిగా మారింది. మంచిర్యాల, కరీంనగర్ నుంచి ఆరెంజ్, మార్నింగ్ స్టార్, మైత్రి, ఐరా వంటి ప్రైవేట్ ఆపరేటర్లు బెంగళూరుకు బస్సులు నడిపిస్తున్నారు. ఆర్టీసీ బస్టాండ్‌ల వద్ద స్టాప్‌లు ఏర్పాటు చేసుకుంటూ సంస్థ ఆదాయానికి గండి కొడుతున్నారు.

దాడికి పాల్పడిన తండ్రీకొడుకులపై కేసు

ఎల్లారెడ్డిపేట, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): చికెన్ సెంటర్‌లోని ప్రవేశించి దాడికి పాల్పడిన రాచర్లగొల్లపల్లిలోని తండ్రీకొడుకులు మహ్మద్ మహబూబ్, అల్తార్‌లపై కేసు నమోదు చేశామని ఎస్ఐ రమాకాంత్ గురువారం తెలిపారు. గ్రామంలోని మహ్మద్ సమ్మద్ చికెన్ సెంటర్ నిర్వహిస్తున్నాడని పేర్కొన్నారు. ఈ నెల 2న సమ్మద్ అదే గ్రామంలోని ల్యాగల శ్రీనివాస్‌తో సెల్‌ఫోనులో మాట్లాడుతున్న క్రమంలో పక్కనే ఉన్న చికెన్ సెంటర్ నిర్వహిస్తున్న మహ్మద్ మహబూబ్, అతని కొడుకు అల్తార్ వచ్చి తమ గురించే మాట్లాడుతున్నాంటూ అనవసరంగా కల్పించుకున్నారని చెప్పారు. చికెన్ సెంటర్‌లోకి ప్రవేశించి తండ్రీకొడుకులు దాడి చేశారని పేర్కొన్నారు. అక్కడే ఉన్న సమ్మద్ సోదరుడు వసీం అడ్డుకునే ప్రయత్నం చేయగా అతనిని చితకబాదారని తెలిపారు. బాధితుడు సమ్మద్ ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని ఎస్ఐ రమాకాంత్ వివరించారు.

బోల్తాపడిన లారీని ఢీకొన్న ప్రైవేట్ బస్సు

కోల్‌సిటీ, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): గోదావరిఖని జీఎంఆఫీస్ కార్నర్‌వద్ద రాజీవ్ రహదారిపై గురువారం లారీబోల్తా పడిం ది. దీంతో వెనుకనుంచి వస్తున్న ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులారీని ఢీకొట్టింది. మంచి ర్యాల నుంచి బెంగుళూరుకు వెళుతున్న ట్రావెల్‌బస్సు లారీని ఢీకొట్టింది. ఈఘటన లో బస్సులోఉన్న పలువురు ప్రయాణీకు లకు స్వల్పగాయాలయ్యాయి. రెండు రోజుల క్రితం ఇదేస్థలంలో బూడిద ట్యాంకర్ బోల్తా పడగా ఇప్పుడు లారీ బోల్తా పడింది.


జీఎం కార్నర్ వద్ద బోల్తా పడిన లారీ

రుణాలు ఇప్పిస్తామని డబ్బులు స్వాహా

వేములవాడ, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ సంస్థల నుంచి రుణాలు ఇప్పిస్తామని నమ్మించి చిరు వ్యాపారుల వద్ద 40వేల రూపాయల వరకు కాజేసిన ఘటన వేములవాడలో వెలుగుచూసింది. ఎస్సీ కార్పొరేషన్, బీసీ కార్పొరేషన్ తదితర సంస్థల నుంచి రాజీవ్‌వికాసం పథకాలకింద3లక్షల రూపాయల వరకు రుణాలు ఇప్పిస్తా మంటూ వేములవాడ పట్టణంలోని కోనాయపల్లి రహదారిలోని బుడగజంగాల కుటుంబాలకు చెందిన మహిళలు, యువకులు, చిరు వ్యాపారులను సిద్దిపేటజిల్లా చిన్నకోడూరు మండలం గోనెపల్లి గ్రామానికిచెందిన అనిల్ అనే వ్యక్తి నమ్మించాడు. 3లక్షల వరకు రుణం మంజూరైతే ఇందులో కేవలం రెండులక్షలు చెల్లిస్తే సరిపోతుందని, మిగతా లక్ష రూపాయలు సబ్సిడీకింద వస్తుందని చెప్పాడని బాధితులు తెలిపారు. ఇందులో ముందుగా బీమా సొమ్ముకింద 3,260 రూపాయలను చెల్లించాల్సి ఉంటుందని చెప్పడంతో 12మంది 39వేల ఒక వంద ఇరవై రూపాయలను అనిల్ ఫోన్ నంబర్‌కి ఫోన్‌పే చేసినట్లు తెలిపారు. మూడురోజులలో లోన్ అప్రూవల్ అవుతుందని చెప్పినప్పటికీ రోజులు గడుస్తున్నా ఎలాంటి సమాచారం రాకపోవడంతో మోసపోయామని గ్రహించి వేములవాడ పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఈవ్యవహారంపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టినట్లు పట్టణసీఐ వీరప్రసాద్ తెలిపారు. ప్రభుత్వపథకాలను ఆసరాగా చేసుకుని నేరగాళ్లు ఇలాంటివి చేస్తారని ప్రజలు గుర్తించి అప్రమత్తంగా ఉండాలన్నారు.

బీసీ గురుకులాల్లో బ్యాక్‌లాగ్ సీట్ల దరఖాస్తులకు

గడువు పెంపు

తిమ్మాపూర్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): బీసీ గురుకుల పాఠశాలల్లో 6,7,8,9వ తరగతుల్లో బ్యాక్ లాగ్ సీట్ల భర్తీ కోసం ఆన్‌లైన్ అప్లికేషన్‌లు సమర్పించేందకు గడువును ఈనెల 6వ తేది వరకు ప్రభుత్వం పొడగించినట్లు ఉమ్మడి కరీంనగర్‌జిల్లా ఆర్‌సీవో ఎం అంజలికుమారి ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా బీసీ గురుకులాల్లో మొత్తం బ్యాక్‌లాగ్ సీట్లు 6832 ఉన్నాయని, ఈ సీట్ల భర్తీకోసం ఈనెల 20న అర్హత పరీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు. మెరిట్ ఆధారంగా ఈ సీట్లను కేటాయించనున్నట్లు, ఆసక్తి, అర్హులైన విద్యార్థులు ఈనెల 6లోగా సంబంధింత వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

బైక్‌పై నుంచి పడి మహిళకు గాయాలు

శంకరపట్నం, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): శంకరపట్నం మండలం ముత్తారం గ్రామశివారులో బైక్ అదుపుతప్పి కింద పడడంతో ఓ మహిళకు గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాలప్రకారం.. కరీంనగర్ జిల్లా దుర్శేడ్‌గ్రామానికి చెందిన గాజుల చంద్రకళ తన కుమారుడు విక్రమ్‌తోకలిసి శంకరపట్నం మండలం ముత్తారంలో తన వియ్యపురాలు దహనసంస్కారాలకు వచ్చారు. కార్యక్రమంముగించుకొని తిరిగి వెళ్తుండగా, ముత్తారంశివారులో బైక్‌అదుపు తప్పడంతో చంద్రకళ బైక్‌మీద నుంచి కింద పడిపోయింది. ఈ ప్రమాదంలో చంద్రకళ కాళ్లకు, చేతులకు, ముఖానికి గాయాలయ్యాయి. స్థానికులు 108లో హుజూరాబాద్ ఏరియా ఆస్పత్రికి తరలించారు.

చేతులు మారిన విదేశీ బంగారం?

- రాణాకు చేరిన పంచాయితీ

వేములవాడ, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): గల్ఫ్ దేశం నుంచి తీసుకొచ్చిన బంగారం ఒకరికి బదులు మరొకరి వద్దకు చేరిన వ్యవహారం వివాదాస్పదంగా మారింది. తమకు రావలసిన బంగారాన్ని తప్పుడు సమాచారంతో మరోవ్యక్తి స్వాహా చేశాడంటూ బాధితులు పోలీసులను ఆశ్రయించగా ఈ వ్యవహారంపై వేములవాడ పట్టణ పోలీసులు దర్యాప్తు చేపట్టారు. విశ్వసనీయ కథనం ప్రకారం.. గల్ఫ్‌లో ఉంటున్న మెట్‌పల్లి ప్రాంతానికి చెందిన ఓ వ్యక్తి స్వదేశం వస్తున్న చందుర్తి మండలానికి చెందిన ఇద్దరు వ్యక్తులతో బంగారం పంపించాడు. అతడు స్వదేశం చేరుకున్న అనంతరం ఆ బంగారం సదరు వ్యక్తి కుటుంబ సభ్యులకు కాకుండా వేములవాడ ప్రాంతానికి చెందిన మరోవ్యక్తికి అప్పగించాడు. బంగారం పంపించిన వ్యక్తి దీనిపై ఆరా తీయగా ఆ బంగారం మరో వ్యక్తికి చేరినట్లు తెలియడంతో పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. ఈ వ్యవహారంపై కేసునమోదు చేసిన వేములవాడ పట్టణ పోలీసులు విచారణ చేపట్టారు. గల్ఫ్ నుంచి బంగారం తీసుకువచ్చిన చందుర్తి మండలానికి చెందిన ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు సమాచారం.

ఈ వ్యవహారంపై వేములవాడ పట్టణ సీఐ వీరప్రసాద్‌ను వివరణ కోరగా బంగారం మాయమైన ఘటనపై ఫిర్యాదు అందిన మాట వాస్తవమేనని, దర్యాప్తు చేపట్టామని తెలిపారు. కస్టమ్స్ అధికారుల కన్నుగప్పి విదేశాల నుంచి బంగారం స్మగ్లింగ్ చేస్తున్న సంఘటనలు హైదరాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో తరచూ వెలుగులోకి వస్తున్నాయి. ఈ నేపథ్యంలో పక్కదారి పట్టిన బంగారం అధికారికంగా తీసుకువచ్చారా లేక అక్రమ మార్గంలో తరలించారా అనేకోణంలో పోలీసులు విచారిస్తున్నట్లు తెలిసింది.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

ఎల్లారెడ్డిపేట, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): ఎలాంటి అనుమతి లేకుండా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను ఎల్లారెడ్డిపేట మండలం రాచర్ల తిమ్మాపూర్ గ్రామశివారులో పట్టుకున్నట్లు ఎస్ఐ రమాకాంత్ గురువారం తెలిపారు. వాహనాన్ని పోలీస్‌స్టేషన్‌కు తరలించి రాచర్లతిమ్మాపూర్ గ్రామానికి చెందిన వాహన యజమాని, డ్రైవర్ కట్ల తిరుపతిపై కేసు నమోదు చేశామని పేర్కొన్నారు. ఏఎస్ఐ నారాయణ ఆధ్వర్యంలోని పోలీసులు రాచర్లతిమ్మాపూర్ గ్రామ శివారులో వాహన తనిఖీలు నిర్వహిస్తున్న క్రమంలో ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను గుర్తించినట్లు తెలిపారు. అనుమతి పత్రాలు లేకపోవడంతో వాహనాన్ని స్వాధీనపర్చుకుని తిరుపతిపై కేసు నమోదు చేశామని పేర్కొన్నారు.

గుడుంబా బట్టీలు ధ్వంసం


మల్లారెడ్డిపల్లిలో గుడుంబా తయారీ సామగ్రితో ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ సిబ్బంది

వీణవంక, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మల్లారెడ్డిపల్లి గ్రామంలో నాటుసారా కాస్తున్నారన్నా సమాచారంతో ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు ఉదయన్నే గుడుంబాబట్టిలపై దాడులుచేసి 200 లీటర్ల బెల్లంపానకం, 10లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నారు. టాస్క్‌ఫోర్స్ సీఐనాగేశ్వర్‌రావు పక్కాసమాచారంతో దాడులు నిర్వహించగా లోకిని పోచయ్యవద్ద 10లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకొని తయారీసామగ్రిని ధ్వంసం చేసినట్లు తెలిపారు. పోచయ్యపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. పలు ఇతర గ్రామాల్లోనూ తనిఖీలు నిర్వహించారు. దాడుల్లో టాస్క్‌ఫోర్స్ హెడ్‌కానిస్టేబుల్ మోసిన్, కానిస్టేబుళ్లు కాసింబి, కుమార్, కమలాకర్, సంతోష్ సాయి తదితరులున్నారు.

ఎదులాపూర్‌లో..

కాల్వశ్రీరాంపూర్: మండలంలోని ఎదులాపూర్ గ్రామంలో గుడుంబా బట్టీలు నిర్వహిస్తున్నారనే సమాచారంతో గురువారం ఎక్సైజ్ పోలీసులు గుడుంబా బట్టీలపై దాడులు నిర్వహించారు. గుడుంబా నిర్వాహకులు పారిపోగా సుమారు 200లీటర్ల గుడుంబా తయారీకి ఉపయోగించే బెల్లం పానకం ధ్వంసం చేసినట్లు ఎక్సైజ్ ఎస్సైలు రాజు, చిరంజీవిలు తెలిపారు. పెగడపల్లి గ్రామంలో సంపంగి శారద గుడుంబా అమ్ముతుండగా తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేసినట్లుతెలిపారు.కార్యక్రమంలోఎక్సైజ్ పోలీసుసిబ్బంది పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులో ఏసీపీ విచారణ


కాచాపూర్‌లో విచారణ చేస్తున్న ఏసీపీ శ్రీనివాస్‌జీ

శంకరపట్నం, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కాచాపూర్‌లో ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీకేసుపై గురువారం హుజూరాబాద్ ఏసీపీ శ్రీనివాస్‌జీ విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కొన్నిరోజులక్రితం కాచాపూర్‌గ్రామానికి చెందిన బామండ్లపల్లి సదయ్యను అదేగ్రామానికి చెందిన ఇనుకొండ మల్లారెడ్డి, అతని భార్య శ్రీలత భూతగాదాల్లో కులంపేరుతో దూషించారు.ఈ విషయంపై సదయ్య కేశవపట్నం పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదుచేశారు. ఫిర్యాదుమేరకు ఏసీపీ శ్రీనివాస్‌జీ, హుజూరాబాద్ రూరల్‌సీఐ పులి వెంకట్, ఎస్ఐ కొత్తపల్లిరవి సాక్షులను విచారించి వివరాలునమోదు చేసుకున్నారు.

గొడ్డలితో దాడి చేసిన వ్యక్తి రిమాండ్

ముత్తారం, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఖమ్మంపల్లి గ్రామానికి చెందిన తీర్థాల స్వామిపై అదే గ్రామానికి చెందిన తీర్థాల కొమురయ్య గొడ్డలితో దాడికి పాల్పడగా అరెస్ట్ చేసి రిమాండుకు తరలించినట్లు ఎస్సై గోపతి నరేష్ తెలిపారు. ఖమ్మంపలిలోని ఓ ప్లాటు విషయంలో బాధితుడు తీర్థాల స్వామికి నిందితుడు తీర్థాల కొమురయ్యకు వివాదాలు ఉన్నాయి. ఉద్దేశపూర్వకంగా వెంటతెచ్చుకున్న గొడ్డలితో హత్యాయత్నానికి పాల్పడినట్లు పైప్‌తో కొట్టినట్లు బాధితుడు ఫిర్యాదు చేయగా కేసుదర్యాప్తు చేసి నిందితుడిని గురువారం కోర్టులో హాజరు పరచినట్లు ఎస్సై తెలిపారు.

ధాన్యం కుప్పకు నిప్పంటించిన గుర్తుతెలియని వ్యక్తులు

సారంగాపూర్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): ధాన్యం కుప్పకు గుర్తుతెలియని వ్యక్తులు నిప్పటించారు. బట్టపల్లి గ్రామానికి చెందిన అర్రై ప్రకాష్ అనే రైతు ఐదురోజుల క్రితం వరిపంటను కోసి ధాన్యాన్ని తన పొలంలో ఆరబెట్టారు. మధ్యాహ్నం రెండు గంటల సమయంలో గుర్తుతెలియని వ్యక్తులు తనపొలంలో నిప్పంటిచారు. దీంతో పొలంలో ఉన్న వరి గడ్డికి అంటుకుని పొలంలో పెద్ద ఎత్తున మంటలు చెలరేగుతూ ధాన్యం కుప్పకు నిప్పంటుకుంది. అదేసమయంలో వస్తున్న రైతు కుమారుడు తన పొలంలో మంటలను గమనించి తన మిత్రుని సహాయంతో మంటలను ఆర్పివేశారు. అప్పటికే ధాన్యం కుప్ప చుట్టు నిప్పంటుకుని మూడు క్వింటాళ్ల ధాన్యం కాలిపోయింది. అధికారులు పరిశీలించి తనను ప్రభుత్వం ఆదుకోవాలని రైతు అర్రై ప్రకాష్ కోరారు.


గాలిపెల్లిలో అసంపూర్తిగా ఉన్న విద్యుత్ సబ్‌స్టేషన్

వినియోగంలోకి వచ్చేదెన్నడు?

- విద్యుత్ సబ్‌స్టేషన్‌కు నిధులు మంజూరై రెండేళ్లు..
- పూర్తికాని పనులు.. ఇబ్బంది పడుతున్న ప్రజలు

ఇల్లంతకుంట, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణానికి నిధులు మంజూరై సంవత్సరాలు గడిచినా పనులు పూర్తికావడం లేదు. దీంతో విద్యుత్ వినియోగదారులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. మండల కేంద్రంలో 133కేవీ సబ్‌స్టేషన్ ఉండగా, దాని పరిధిలో ఇల్లంతకుంట, సోమారంపేట, కందికట్కూర్, రహీంఖాన్‌పేట, పెద్ద లింగాపూర్ గ్రామాల్లో 33 కేవీ సబ్‌స్టేషన్లు ఉన్నాయి. అయినా మరికొన్ని గ్రామాలకు లోవోల్టేజీ సమస్యలు ఉన్నాయని రైతులు పలుసార్లు విన్నవించారు. గాలిపెల్లి గ్రామంలో 33 కేవీసబ్‌స్టేషన్ ఏర్పాటు చేస్తే జవారిపేట, తాళ్లపెల్లి, పత్తికుంటపల్లె, గాలిపెల్లి, నర్సక్కపేట గ్రామాల విద్యుత్ వినియోగదారులకు ఉపయోగం ఉంటుంది. ఈ ఐదు గ్రామాల్లో దాదాపు 4వేల వ్యవసాయ, గృహ వినియోగదారుల విద్యుత్ మీటర్లతో పాటు 11 ఇండస్ట్రియల్ కనెక్షన్లు ఉంటాయి. వినియోగదారుల విన్నపాల మేరకు రెండు సంవత్సరాల క్రితం రూ.2కోట్లతో సబ్‌స్టేషన్‌తో పాటు విద్యుత్‌లైన్ల నిర్మాణం కోసం ఎన్‌పీడీసీఎల్ మంజూరు చేస్తున్నట్లు ప్రకటించింది. సబ్‌స్టేషన్ నిర్మాణం కోసం స్థలసమస్య ఏర్పడింది. అనేక అవాంతరాల మధ్య ఇరిగేషన్ భూమిని అప్పగించారు. భూమిపూజ చేసే సమయానికి ఎన్నికల కోడ్ రావడంతో అధికారులే భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. తొలుత పనులు వేగవంతంగా పూర్తి అయినా పవర్ ట్రాన్స్‌ఫార్మర్ రాకపోవడంతో వినియోగంలోకి రాలేదు. ప్రజా ప్రతినిధులు, ఉన్నతస్థాయి అధికారులు స్పందించి 33కేవీ సబ్‌స్టేషన్‌ను వినియోగంలోకి తేవాలని రైతులు, విద్యుత్ వినియోగదారులు కోరుతున్నారు.

సబ్‌స్టేషన్‌ను వినియోగంలోకి తేవాలి..

న్యాత బాలయ్య, రైతు జవారిపేట



గాలిపెల్లి గ్రామంలో నిర్మాణంలో ఉన్న విద్యుత్ సబ్‌స్టేషన్‌ను వినియోగంలోకి తేస్తే సమస్యలు తీరుతాయి. ఇల్లంతకుంట సబ్‌స్టేషన్ నుంచి 25కిలీమీటర్ల విద్యుత్ లైన్ ఉండటం వల్ల తరచూ విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతోంది. వ్యవసాయ బావులకు లోవోల్టేజీ వస్తుండటంతో విద్యుత్ మోటార్లు తరచూ కాలిపోతున్నాయి. గృహాలకు అప్పుడప్పుడు రాత్రంతా విద్యుత్ సరఫరా నిలిచిపోతోంది. ఉన్నత స్థాయి అధికారులు స్పందించి పనులు పూర్తిచేసి సబ్‌స్టేషన్‌ను వినియోగంలోకి తీసుకరావాలి.

త్వరలో పనులు పూర్తిచేస్తాం

మల్లుగారి రవీందర్‌రెడ్డి, సెస్ డైరెక్టర్ ఇల్లంతకుంట



గాలిపెల్లి గ్రామంలోని 33కేవీ సబ్‌స్టేషన్ పనులు త్వరలో పూర్తిచేసి మెరుగైన విద్యుత్‌ను అందిస్తాం. స్థలసేకరణలో కొంత ఆలస్యం జరిగింది. సబ్‌స్టేషన్ పనులు పూర్తి అయినప్పటికీ పీటీఆర్ రాకపోవడంతో కొంత ఆలస్యం జరిగింది. గాలిపెల్లి సబ్‌స్టేషన్ వినియోగంలోకి వస్తే సరఫరాలో అంతరాయం, లోవోల్టేజీ సమస్య తొలగిపోతుంది. ఇప్పటికే విద్యుత్ వైర్ల కింద ఉన్న చెట్ల కొమ్మలను తొలగించాం. మెరుగైన సేవలు అందించడానికి కృషిచేస్తాం.

రెస్టారెంట్లో అగ్ని ప్రమాదం

- రూ 30 లక్షల ఆస్తి నష్టం

జ్యోతినగర్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : ఎన్టీపీసీ టీటీఎస్ గేట్ ప్రధాన రహదారిలో ఉన్న ఖుషి రెస్టారెంట్లో గురువారం తెల్లవారుజామున అగ్ని ప్రమాదం సంభవించింది. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా రెస్టారెంట్లో మంటలు చెలరేగాయి. రెస్టారెంట్ నుంచి పొగ రావడం చూసిన చుట్టుపక్కల వారు పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు అగ్నిమాపక స్టేషన్‌కు సమాచారం ఇవ్వడంతో సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకొని మంటలను అదుపులోకి తెచ్చారు. ఎన్టీపీసీ ఎస్ఐ ఉదయ్‌కిరణ్ సంఘటనా స్థలానికి వెళ్లి విచారించారు. షార్ట్ సర్క్యూట్ కారణంగానే అగ్ని ప్రమాదం జరిగినట్లు ప్రాథమికంగా అంచనా వేశారు. రెస్టారెంట్లోని ఫర్నిచర్, ఇతర వస్తువులు దగ్ధమయ్యాయి. సుమారు రూ.30 లక్షల మేరకు ఆస్తి నష్టం జరిగినట్లు తెలుస్తున్నది. మంటలను త్వరగా అదుపులోకి తేవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. రెస్టారెంట్ కిందనే బ్యాంకు, పక్కనే మరో కొన్ని దుకాణాలున్నాయి. ఎన్టీపీసీ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కలకలం రేపుతున్న కోళ్ల కళేబరాలు

గంభీరావుపేట, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): గంభీరావుపేట మండలం నర్మాల ఎగువ మానేరువాగులో చనిపోయిన కోళ్ల కళేబరాలు కలకలం రేపుతున్నాయి. మృతిచెందిన కోళ్లను సంచుల్లో నింపి మానేరురోడ్డు వంతెనవద్ద వాగులో పడేశారు. చనిపోయిన వందలాది కోళ్లు మానేరు వాగులో ప్రత్యక్షం కావడంతో ప్రజలు భయందోళనలు వ్యక్తం చేస్తున్నారు. మానేరు జలాశయ ప్రాంతం రాజన్న సిరిసిల్ల జిల్లాతోపాటు సిద్దిపేట, కామారెడ్డి జిల్లాల సరిహద్దులో ఉండటంతో మృతిచెందిన కోళ్లను ఏప్రాంతం వారు పారేశారనేది తెలియడం లేదు.

కొనసాగుతున్న జేఈఈ మెయిన్స్

● 1056 మంది అభ్యర్థులకు 987 మంది హాజరు



ఐయాన్ డిజిటల్ జోన్ పరీక్ష కేంద్రం వద్ద అభ్యర్థుల పత్రాలను పరిశీలిస్తున్న నిర్వాహకులు

తిమ్మాపూర్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టీఏ) నిర్వహించే జేఈఈ మెయిన్స్, బీఆర్క్ రెండవ విడత-2025 పరీక్షలు కరీంనగర్‌జిల్లాలో ప్రశాంతంగా కొనసాగుతున్నాయి. ఉదయం 9నుంచి మధ్యాహ్నం 12గంటలవరకు మొదటిసెషన్, మధ్యాహ్నం 3నుంచి సాయంత్రం 6గంటలవరకు రెండోసెషన్‌లలో పరీక్షలు జరుగుతున్నాయి. పరీక్షలు బుధవారం ప్రారంభం కాగా గురువారం ఉదయం, మధ్యాహ్నం రెండు సెషన్‌లలో కలిపి 1,056 మందికి 987మంది పరీక్షకు హాజరు కాగా 69మంది గైర్హాజరయ్యారని సిటీకోఆర్డినేటర్ టి లలితకుమారి తెలిపారు. కొందరు విద్యార్థులు పరీక్ష సమయానికన్నా ఆలస్యంగా రావడంతో అధికారులు లోపలికి అనుమతి ఇవ్వలేదు.

సాగులో మెళకువలతోనే అధిక దిగుబడులు

● జగిత్యాల అదనపు కలెక్టర్ బీఎస్ లత



మాట్లాడుతున్న జగిత్యాల జిల్లా అదనపు కలెక్టర్ బీఎస్ లత

జగిత్యాల అగ్రికల్చర్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకొని పంటల సాగులో మెళకువలు పాటిస్తే అధిక దిగుబడులు సాధ్యమని జగిత్యాల జిల్లా అదనపు కలెక్టర్ బీఎస్ లత అన్నారు. జగిత్యాల రూరల్ మండలంలో ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనస్థానం పోలాసలో ఉత్తర తెలంగాణ మండల వ్యవసాయ పరిశోధన, విస్తరణ సలహా సంఘం ఆధ్వర్యంలో రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా అదనపు కలెక్టర్ లతతో పాటు, విశ్వవిద్యాలయ పరిశోధన సంచాలకులు డాక్టర్ బలరాం హాజరయ్యారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ వరిపంటను ఏప్రిల్ మొదటి వారంలోనే కోతకోసే విధంగా రైతులు ప్రణాళికలు సిద్ధం చేసుకుంటే నూకశాతం తగ్గించు కోవచ్చన్నారు. డాక్టర్ బలరాం మాట్లాడుతూ గత సంవత్సర పరిశోధన, విస్తరణలను వివరించారు. అనంతరం పది జిల్లాల వ్యవసాయ అధికారులు గత, ప్రస్తుత సంవత్సరం వివిధ పంటల్లో వచ్చిన చీడపీడలు, ఇతర సమస్యలు, వాటి పరిష్కారాలు రైతులకు వివరించారు. కార్యక్రమంలో ఉత్తర తెలంగాణ మండల శాస్త్రవేత్తలు, వ్యవసాయ, అనుబంధ శాఖల అధికారులు, వివిధ పంటల ప్రధాన శాస్త్రవేత్తలు, డైరెక్టర్లు, రైతులు పాల్గొన్నారు.

బీఫార్మసీ ఫలితాలు విడుదల

గణేశ్‌నగర్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): శాతవాహన విశ్వవిద్యాలయం పరిధిలో మార్చి2025లో నిర్వహించిన బీఫార్మసీ 5,6,7,8, సెమిస్టర్ల ఫలితాలను గురువారం యూనివర్సిటీ పరీక్షల నియంత్రణ అధికారి సురేష్ కుమార్ విడుదల చేశారు. ఫలితాలు యూనివర్సిటీ వెబ్‌సైట్‌లో ఉన్నట్లు పేర్కొన్నారు.

వైభవంగా వేంకటేశ్వరస్వామి రథోత్సవం

గొల్లపల్లి, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): గొల్లపల్లి మండలం వెన్నుమట్ల-బొంకూర్ గ్రామాల మధ్య కొలువుదీరిన వేంకటేశ్వరస్వామి జాతర ఉత్సవాలు రెండురోజులుగా అత్యంత వైభవంగా జరుగుతున్నాయి. జాతర ఉత్సవాల్లో భాగంగా రెండోరోజు వేంకటేశ్వరస్వామి డోలోత్సవం, రథోత్సవం వైభవంగా నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఉత్సవాలు ఘనంగా సాగుతున్నాయి. ఈ సందర్భంగా ప్రత్యేకించిన రథంపై స్వామివారి ఉత్సవమూర్తిని ప్రతిష్ఠించి భక్త జనసందోహం మధ్య భక్తులు రథోత్సవాన్ని నిర్వహించారు. భక్తుల వెంకన్న నామస్మరణలతో, అంజన్న దీక్షాస్వాముల సంకీర్తనలతో ఆలయ పరిసర ప్రదేశాలు మార్మోగాయి. కార్యక్రమాల్లో మాజీ ప్రజాప్రతినిధులు కందుకూరి సత్తయ్య, సురిగినేని కమలాకర్ రావు, ఆలయ కమిటీ చైర్మన్ రాంగోపాల్ రెడ్డి, భక్తులు పాల్గొన్నారు.





రాములోరి పెళ్లి..
చూసి వద్దాం రండి

ఇల్లందకుంటలో పూర్తయిన ఏర్పాట్లు

నేటి నుంచి బ్రహ్మోత్సవాలు ప్రారంభం

రాష్ట్ర ప్రభుత్వం తరుపున పట్టువస్త్రాలు సమర్పించనున్న మంత్రి పొన్నం ప్రభాకర్

ఇల్లందకుంట, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): ఇల్లందకుంట సీతారామచంద్రస్వామి ఆలయంలో శ్రీరామ నవమి, బ్రహోత్సవాలకు అధికారులు ఏర్పా ట్లు పూర్తి చేశారు. శుక్రవారం నుంచి 16 వరకు ఉత్సవాలను నిర్వహించనున్నారు. ఇల్లందకుంట సీతారామాలయ చరిత్ర రామాయణంతో ముడిపడి ఉన్నట్లు పూర్వీకులు చెబుతారు. త్రేతా యుగంలో రాముడు, లక్ష్మణుడు, సీత అరణ్య వాసం చేస్తూ ఇక్కడ సేద తీరారు. ఆ సమయంలో రామ లక్ష్మణుల తండ్రి దశరథ మహారాజు మరణవార్త తెలుస్తుంది. రాముడు అక్కడ ఉన్న ఇల్లంద వృక్షానికి సంబంధించిన పలుకలతో తన తండ్రి శ్రాద్ధకర్మలు జరిపించాడు. అప్పటి నుంచి ఈ గ్రామానికి ఇల్లం దకుంట అని పేరు వచ్చింది. ఈ ఆలయంలోని ఉత్సవమూర్తులకు పుట్టు మచ్చలు ఉంటాయి. రాముడు అరణ్యవాసం చేస్తున్న సమయంలో ఇక్కడ 13రోజులు సేద తీరారు. ఆయన సంచరిం చిన గ్రామాలు లక్ష్మాజిపల్లె, శ్రీరాములపల్లె, సీతంపేట, సిరిసేడు, లక్ష్మన్నపల్లె అని పేరుపడ్డాయి. శుక్రవారం నుంచి 16 వరకు జరిగే ఉత్సవాలకు భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలుగకుండా అధికారులు ఏర్పాట్లు చేశారు.

భారీగా తరలిరానున్న భక్తులు

ఈ ఉత్సవాలకు సుమారు లక్షకుపైగా భక్తులు హాజరు కానున్నారు. కల్యాణానికి వచ్చే భక్తులకు జమ్మికుంట కాటన్, రా రైస్, పారాబాయిల్డ్ మిల్లర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మహా అన్నదానం నిర్వహించనున్నారు. ఎల్‌ఈడీ స్ర్కీన్లు, తాగునీరు, చలువ పందిళ్లు ఏర్పాటు చేశారు. వైద్య శిబిరం నిర్వహించనున్నారు. 108, 104 వాహనాలను సిద్ధంగా ఉంచారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఏసీపీ శ్రీనివాస్‌జీ, జమ్మికుంట రూరల్ సీఐ కిశోర్, ఎస్‌ఐ రాజకుమార్ ఆధ్వర్యంలో భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు. ఆలయ పరిసర ప్రాంతాల్లో 40 సీసీ కెమెరాలు అమర్చారు. 300 మంది పోలీస్ సిబ్బంది బందోబస్తులో పాల్గొననున్నారు.



ఆలయ ముఖద్వారం

భక్తులకు అన్ని ఏర్పాట్లు చేశాం

కందుల సుధాకర్, ఆలయ ఈవో, ఇల్లందకుంట



స్వామివారి బ్రహ్మోత్సవాలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా దేవాదాయ ధర్మా దాయ శాఖ ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు చేశాము. సీతారామచంద్రస్వామి ఆలయంలో జరిగే ఉత్సవాలకు హాజరయ్యే భక్తులు ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గిం చాలి. సీతారాముల కల్యాణంలో పాల్గొన్న దంపతు లు 3,016 రూపాయలు చెల్లించి దేవస్థానంలో రసీదు పొందాలి. సాంప్రదాయ దుస్తులు ధరించి ఉదయం 10గంటల లోపు స్వామివారి కల్యాణ మండపానికి రావాలి.

బ్రహ్మోత్సవాల వివరాలు

శుక్రవారం సాయంత్రం ఏడు గంటలకు స్వామివారు గ్రామ ఆలయం నుంచి బాహ్య మందిర ప్రవేశం చేస్తారు. 5న శనివారం రాత్రి ఏడు గంటలకు విశ్వక్సేనారాధన, రక్షాబంధనం, అంకురార్పణ, అగ్ని పరీక్ష నిర్వహిస్తారు. 6న ఆదివారం ఉదయం 10 గంటలకు ధ్వజారోహణం, ఉదయం 11 గంటలకు ఎదుర్కోళ్లు, మధ్యా హ్నం 12గంటలకు శ్రీసీతారాముల కల్యాణం, రాత్రి 9గంటలకు శేషవాహన సేవ ఉంటుంది.

- 7న సోమవారం ఉదయం 10 గంటలకు పట్టాభిషేక ఉత్సవం, సువర్ణ పుష్పార్చన, సాయంత్రం ఏడు గంటలకు ప్రభుత్సోత్సవం ప్రారంభమ వుతుంది. రాత్రి 9 గంటలకు హంస వాహన సేవ నిర్వహిస్తారు.
- 8న మంగళవారం సాయంత్రం 6 గంటలకు ప్రభుత్సోత్సవం ఉంటుంది. రాత్రి 9 గంటలకు గరుడవాహన సేవ అనంతరం భక్తులు మొక్కులు చెల్లించుకుంటారు.
- 9న బుధవారం సాయంత్రం 6గంటలకు ప్రభుత్సోత్సవం, రాత్రి 9 గంటలకు హనుమత్ వాహన సేవ నిర్వహిస్తారు.
- 10న గురువారం సాయంత్రం 6 గంటలకు ప్రభుత్సోత్సవం, రాత్రి 9 గంటలకు గజవాహన సేవ ఉంటుంది.
- 11న శుక్రవారం సాయంత్రం 6 గంటలకు ప్రభుత్సో త్సవం, రాత్రి 9 గంటలకు అశ్వవాహన సేవ నిర్వహిస్తారు.
- 12న శనివారం సాయంత్రం 6 గంటలకు బండ్లు తిరగడం, రాత్రి 9గంటలకు సూర్య రథోత్స వం (చిన్న రథం) ఉంటుంది.
- 13న ఆదివారం రాత్రి 9 గంటలకు స్వామి వారు చంద్ర రథోత్సవం (పెద్ద రథం) మీదకు వస్తారు.
- 14 సోమవారం సాయంత్రం 4గంటల వరకు భక్తులకు చంద్రరథం పైన స్వామివారి దర్శనం ఇస్తారు. అనంతరం తిరుమాడ వీధుల్లో రథ ఊరేగింపు నిర్వహిస్తారు.. రాత్రి 7గంటలకు మహాపూర్ణాహుతి, మహాకుంభ సంప్రోక్షణ ఉంటుంది.
- 15న మంగళవారం ఉదయం 11 గంటలకు నవకలశ స్నపన "చక్ర తీర్థం" శంభాధర చక్రధా ర సహస్రదార్ చేయించి ఇచ్చిన దాతల పేర్లతో తిరుమంజనం, రాత్రి 9 గంటలకు శ్రీపుష్పయాగం (నాఖబలి) నిర్వహిస్తారు.
- 16న బుధవారం రాత్రి 9గంటలకు సప్తవర్ణాలు, ఏకాంతసేవతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయి.

కార్మికులకు కూలీ పెంచాలి

● సీఐటీయూ పవర్‌లూం వర్కర్స్ యూనియన్ డిమాండ్



సిరిసిల్ల పోలీస్ స్టేషన్‌లో మాట్లాడుతున్న కార్మిక సంఘం నాయకులు

సిరిసిల్ల రూరల్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్లలో రాష్ట్ర ప్రభుత్వం తయారు చేయించే చీరలతో పాటు పాలిస్టర్ వస్త్రాలకు కూలీ పెంచాలని సీఐటీయూ పవర్‌లూం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు మూషం రమేష్, జిల్లాఅధ్యక్షుడు కోడం రమణ డిమాండ్‌చేశారు. సిరిసిల్లలో మరమగ్గాలతోపాటు అనుబంధరంగాల కార్మికు కూలీనిర్ణయించి, సమస్యలను పరిష్కరించాలంటూ సీఐటీయూ పవర్‌లూం వర్కర్స్ యూనియన్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సిరిసిల్లలో మూడురోజులుగా నిరవధికసమ్మె చేపట్టారు. ఇందులో భాగంగా గురువారం సిరిసిల్లలో ఆందోళన కార్యక్రమాలను చేపడుతారనే అనుమానంతో గురువారం తెల్లవారుజామున సిరిసిల్ల పోలీసులు సీఐటీయూ పవర్‌లూం వర్కర్స్ యూనియన్ నాయకులను అరెస్ట్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. విషయం తెలుసుకున్న మర మగ్గాల అనుబంధ రంగాలకు చెందిన కార్మికులు పోలీస్‌స్టేషన్‌కు తరలివచ్చి నాయకులకు సంఘీభావం ప్రకటించారు. గురువారం కార్మిక సంఘాలకు చెందిన జిల్లా అధ్యక్షుడు కోడం రమణ, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎగమంటి ఎల్లారెడ్డి, అన్నల్‌దాస్ గణేష్, వార్పిన్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు సిరిమల్లె సత్యం, వైపని యూనియన్ గౌరవ అధ్యక్షుడు ఒగ్గు గణేష్, నాయకులు నక్కదేవదాస్, గుండు రమేష్, సబ్బని చంద్రకాంత్, బెజుగం సురేష్, ఎలిగేటి శ్రీనివాస్, ఎక్కలిదేవి జగదీష్, ఉడుత రవి, మచ్చ వేణు, బోట్ల వెంకటేశం పాల్గొన్నారు.

ఆయుర్వేద మందుల కంపెనీ యజమానికి జరిమానా

జగిత్యాల, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): ఓ ఆయుర్వేద కంపెనీ యాజమాన్యానికి 15 వేల రూపాయల జరిమానా విధిస్తూ ఫస్ట్ అడిషినల్ జ్యుడిషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ జితేందర్ గురువారం తీర్పు వెలువరించినట్టు జిల్లా డ్రగ్ ఇన్‌స్పెక్టర్ ఉపేందర్ తెలిపారు. 2024 మే నెలలో జగిత్యాల జిల్లా డ్రగ్ ఇన్‌స్పెక్టర్ ఉపేందర్ చేసిన తనిఖీలో భాగంగా స్టోన్ లాకసిరప్ అనే ఆయుర్వేద మందు లేబుల్‌పై తప్పుదోవ పట్టించే ఆరోగ్యవాదనలు ఉన్నట్లు గుర్తించారన్నారు. హర్యాన రాష్ట్రానికి చెందిన లెవీట్ హెల్త్‌కేర్ కంపెనీపై డ్రగ్ మరియు రెమెడీస్ చట్టం 1954 ప్రకారం కేసు నమోదు చేసుకొని కోర్టులో చార్జీషీట్ వేశారు. ఈ కేసులో వాదనలు విన్న మేజిస్ట్రేట్ జితేందర్ కంపెనీ యజమాన్యానికి 15వేల రూపాయల జరిమానా లేదా నెలరోజుల జైలు శిక్ష విధించినట్లు డ్రగ్ ఇన్‌స్పెక్టర్ ఉపేందర్ తెలిపారు.

నృసింహుడి సన్నిధిలో విద్యారణ్య భారతి స్వామి



నృసింహుని సన్నిధిలో ధ్వజ స్తంభం వద్ద పూజలు నిర్వహిస్తున్న స్వామీజీ

ధర్మపురి, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి క్షేత్రంలోని లక్ష్మీనృసింహస్వామి దేవాలయాన్ని అనంతపూర్ విరూపాక్ష మఠం దత్తాత్రేయ మహా సంస్థానానికి చెందిన విద్యారణ్య భారతి స్వామీ గురువారం సందర్శించారు. ఆలయం వద్ద వారికి అర్చకులు, సిబ్బంది పూర్ణకుంభ స్వాగతం పలికారు. అనంతరం ఆయన స్వామి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ జక్కు రవీందర్, ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్ ఆయనకు స్వామి శేష వస్త్రం, ప్రసాదాలు, చిత్రపటం అందించి ఘనంగా సత్కరించారు.

స్వామీజీ వెంట ధర్మకర్తలు బాదినేని వెంకటేష్, స్తంభంకాడి గణేష్, రాపర్తి సాయికుమార్, ఆలయ ఉపప్రధాన అర్చకులు నేరెళ్ల శ్రీనివాసాచార్యులు, ముఖ్యఅర్చకులు సీహెచ్ రమణయ్య, నంబి నరసింహమూర్తి, చక్రపాణి వామనాచార్య, చక్రపాణి కిరణ్, సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్, సిబ్బంది, అర్చకులు తదితరులు పాల్గొన్నారు.

ఎండలోనే ఎదురుచూపులు

బస్‌షెల్టర్లు లేక ప్రయాణికుల ఇబ్బందులు



రాచర్లగొల్లపల్లిలో ప్రధాన రహదారిపై వేచి చూస్తున్న ప్రయాణికులు

ఎల్లారెడ్డిపేట, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి):మండలంలోని రాచర్లగొల్లపల్లి, రాచర్లబొప్పాపూర్ గ్రామాల్లో బస్‌షెల్టర్లు లేక ప్రయాణికులు ఎండలోనే నిలబడి అవస్థలు పడుతున్నారు. వృద్ధులు, మహిళలు, విద్యార్థులు, చిన్నారులు ఆర్టీసీ బస్సు కోసం వేచి చూస్తున్నారు. ఎండనక, వాననక కామారెడ్డి-సిరిసిల్ల ప్రధాన రహదారిపై ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నా సంబంధితశాఖ అధికారులు పట్టించుకోవడం లేదు.

నీడ కరవు.. సౌకర్యాలు లేవు..

మండలంలోని రాచర్లగొల్లపల్లి, రాచర్లబొప్పాపూర్ గ్రామాలు కామారెడ్డి-సిరిసిల్ల ప్రధాన రహదారిని ఆనుకుని ఉన్నాయి. ఆయా గ్రామాల ప్రజలు, విద్యార్థులు అవసరా ల నిమిత్తం సిరిసిల్ల, కామారెడ్డి, కరీంనగర్, సిద్దిపేట, హైదరాబాద్ తదితర పట్టణాలకు రాకపోకలు సాగిస్తుంటారు. నిత్యం వందల సంఖ్యలో ప్రయాణికులు ఆర్టీసీ బస్సుల్లోనే వెళుతుంటారు. బస్‌షెల్టర్లు లేకపోవడం వల్ల రోడ్డుకు ఓ వైపు రాచర్లగొల్లపల్లి, మరోవైపు రాచర్లబొప్పాపూర్ ప్రజలు ఆర్టీసీ బస్సుల కోసం నిలబడుతున్నారు. రాచర్లగొల్లపల్లిలో గతంలో ఉన్న బస్‌షెల్టర్‌ను గ్రామపంచాయతీ అధికారులు, ప్రజాప్రతినిధులు కూల్చివేశారు.

అదేస్థలంలో రెండంతస్థుల భవనం నిర్మించి వెనుక వైపు సామూహిక మూత్రశాలలను ఏర్పాటు చేశారు. కింద ఉన్న గదులను అద్దెకు ఇచ్చారు. ప్రయాణికుల కోసం బస్ షెల్టరును తిరిగి నిర్మించలేదు. దాంతో ప్రయాణికులకు నీడ లేకుండాపోయింది. రహదారిపైనే నిలబడడం వల్ల ఇబ్బందులు పడాల్సి వస్తోందని వాపోతున్నారు. కనీసం తాగేందుకు నీటి సౌకర్యం లేదని పేర్కొంటున్నారు. రాత్రి సమయంలో రోడ్డుపై నిలబడడంతో కనిపించక ప్రమాదాలు జరుగుతున్నాయని చెబుతున్నారు. ఎండ నుంచి ఉపశమనం పొందేందుకు తాత్కాలికంగా చలువ పరదాలను ఏర్పాటు చేయడంతో పాటు బస్ షెల్టర్లను నిర్మించి తమ ఇబ్బందులను తీర్చాలని ప్రయాణికులు కోరుతున్నారు.

ఎండలోనే నిలబడుతున్నాం..

సమీద్, రాచర్లబొప్పాపూర్



మా ఊరు నుంచి ఆర్టీసీ బస్సులో వెళ్లాలంటే కామారెడ్డి-సిరిసిల్ల రోడ్డు వరకు రావాలి. బస్ షెల్టర్ లేకపోవడం వల్ల రోడ్డుపై ఎండలోనే నిలబడుతున్నాం. గంటల తరబడి నిలబడేందుకు ఇబ్బందులు పడాల్సి వస్తోంది. ఓపిక లేక దుకాణాల ముందు కూర్చుంటున్నాం. అధికారులు పట్టించుకుని బస్ షెల్టర్‌ను నిర్మించాలి.

అధికారులు బస్ షెల్టర్లను నిర్మించాలి

దాసరి పూర్ణిమ, రాచర్లగొల్లపల్లి



మండలంలోని రాచర్లగొల్లపల్లి, రాచర్లబొప్పాపూర్ రెండు గ్రామాలు రోడ్డుకు ఇరువైపులా ఉంటాయి. ఆ రెండు గ్రామాల ప్రజలు వివిధ పనుల కోసం ఇతర గ్రామాలకు వెళ్లాంటే బస్సు కోసం రహదారిపై నిలబడాల్సి వస్తోంది. బస్ షెల్టర్లు లేక ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు నిర్మించి ప్రయాణికుల ఇబ్బందులు తీర్చాలి.

ప్రయాణికుల ఇబ్బందులపై పంచాయతీ అధికారుల దృష్టికి..

ప్రకాశ్‌రావు, ఆర్టీసీ డీఎం, సిరిసిల్ల

ఎల్లారెడ్డిపేట మండలంలోని రాచర్లగొల్లపల్లి, రాచర్లబొప్పాపూర్ గ్రామాల్లో బస్ షెల్టర్లు లేక ప్రయాణికులు రహదారిపై నిలబడుతున్నారని మా దృష్టికి వచ్చింది. బస్ షెల్టర్లు గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. ప్రయాణికులు పడుతున్న ఇబ్బందులపై పంచాయతీ అధికారుల దృష్టికి తీసుకెళతాం. సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటాం.

ఫోన్ చేస్తే సమస్యల పరిష్కారానికి కృషి

● చొప్పదండి ఎమ్మెల్యే డాక్టర్ మేడిపల్లి సత్యం



సన్నబియ్యం పంపిణీని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సత్యం

కొడిమ్యాల, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని ప్రజలు ఫోన్‌చేస్తేచాలు వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని చొప్పదండి ఎమ్మెల్యే డాక్టర్ మేడిపల్లి సత్యం తెలిపారు. గురువారం మండల కేంద్రంలో సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం మేడిపల్లి సత్యం మాట్లాడుతూ పేద ప్రజల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం ఎక్కడ లేని విధంగా సన్న బియ్యం పంపిణీని ప్రారంభించిందన్నారు. పదేళ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం చేయలేని అభివృద్ధిని ఏడాదిలో చేశామన్నారు. వచ్చే నాలుగేళ్లలో అన్ని రంగాల్లో నియోజకవర్గాన్ని ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతానన్నారు. ప్రజలసంక్షేమం కోసం నిరంతరం ముందుకు సాగుతామన్నారు. 30మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మీ, షాదీముబారక్ చెక్‌లను ఎమ్మెల్యే అందించారు. మండలంలోని కొండాపూర్ గ్రామానికి చెందిన గుండ బాబు ఆవును గత జనవరిలో పెద్దపులి దాడి చేసి చంపగా ప్రభుత్వం నుంచి వచ్చిన 35 వేల రూపాయల చెక్‌ను ఎమ్మెల్యే బాధితునికి అందించారు. కార్యక్రమంలో డీఎస్‌వో జితేందర్‌రెడ్డి, డీఎం సివిల్ సప్లయిస్ జితేందర్, రేంజర్ మొయినొద్దీన్, తహసీల్దార్ రమేష్, ఎంపీడీవో స్వరూప, డిప్యూటీరేంజర్ ముషీర్ అహ్మద్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నారాయణగౌడ్, మల్యాల వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ జీవన్‌రెడ్డి, సింగిల్ విండో చైర్మన్ రాజనర్సింగరావు, కాంగ్రెస్ పార్టీ నాయకులు మహిపాల్‌రెడ్డి, ముత్యం శంకర్‌గౌడ్, మల్లికార్జున్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, చంద్రమోహన్‌రెడ్డి, రాజేందర్, అజయ్‌గౌడ్, స్వామి, మల్లేశం, రవి, తదితరులు పాల్గొన్నారు.

రాజన్న ఆలయానికి చేరుకున్న ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యులు



ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్, సభ్యులకు స్వాగతం పలుకుతున్న ఈవో వినోద్‌రెడ్డి తదితరులు

వేములవాడ కల్చరల్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి వారి ఆలయానికి రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్‌తోపాటు సభ్యులు గురువారం చేరుకున్నారు. ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య, సభ్యులు కుస్రం నీలదేవి, రాంబాబు నాయక్, కొంకటి లక్ష్మీ నారాయణ, జిల్లా శంకర్, రేనికుంట్ల ప్రవీణ్‌లకు ఆలయ ఈవో వినోద్‌రెడ్డి ఆర్డీవో, రాజేశ్వర్, ఏఈవో అశోక్‌లు స్వాగతం పలికారు. శుక్రవారం ఉదయం రాజన్నను దర్శించుకోనున్నట్లు తెలిపారు.

● న్యూస్‌బాక్స్

సన్నబియ్యం పంపిణీ

భగత్‌నగర్, ఏప్రిల్3 (ఆంధ్ర జ్యోతి): మండలంలోని చింతకుంట రేషన్ షాపులో గురువారం కాంగ్రెస్ నాయకులు సన్నబియ్యం పంపిణీ ప్రారంభించారు. నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత కంటి శస్త్ర చికిత్సలు

కరీంనగర్ రూరల్, ఏప్రిల్ 3 (ఆంధ్ర జ్యోతి : లయన్స్ క్లబ్ ఆఫ్ కరీంనగర్ బొమ్మకల్ ఆధ్వర్యంలో లయన్ చింతల కిషన్ పటేల్ ఉచిత కంటి శస్త్ర చికిత్సలు నిర్వహించారు. కార్యక్రమంలో గన్ను నర్సింహారెడ్డి, గన్ను రాంచంద్రారెడ్డి, కంటాల శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

భగత్‌నగర్, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): కొత్తపల్లి పట్టణంలో పలువురికి మంజూరైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను కాంగ్రెస్ నాయకుడు పొన్నం సత్యనారాయణగౌడ్ ఆధ్వర్యంలో గురువారం పంపిణీ చేశారు. కొత్తపల్లి పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్, పొన్నం శ్రీనివాస్, కర్రం కనకారెడ్డి, దుబాసి కుమార్ పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలపై విచారణ

హుజూరాబాద్, ఏప్రిల్ 3 (ఆంధ్ర జ్యోతి): హుజూరాబాద్ పట్టణంలో వరంగల్ రోడ్‌లోని పెద్దమోరి సమీపంలో చిలుకవాగులో అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారన్న ఫిర్యాదు మేరకు గురువారం సర్వే అధికారులు విచారణ చేపట్టారు. ఈ అక్రమ నిర్మాణాలపై ముదిరాజ్ మహాసభ జిల్లా ఉపాధ్యక్షుడు కొలిపాక సమ్మయ్య రెండ్రోజుల క్రితం స్థానిక తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో తహసీల్దార్ కనకయ్య, డీఐ ఎండీ ఫయాక్‌అలీ, మండల సర్వేయర్లు హద్దులు నిర్ణయించారు.

భక్తి గీతాలాపన పోటీలకు ఆహ్వానం

కరీంనగర్ కల్చరల్, ఏప్రిల్ 4 (ఆంధ్ర జ్యోతి): శ్రీమద్రామాయణ ప్రవచన సప్తాహంలో భాగంగా వివిధ పోటీలకు ఔత్సాహికులను ఆహ్వానిస్తున్నట్లు నిర్వాహకులు ప్రకటనలో తెలిపారు. ఇస్కాన్ కరీంనగర్ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ చౌరస్తా సమీపంలోని రాధా గోవిందుల బాలాలయంలో చేపట్టిన వసంత నవరాత్రోత్సవాలు కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా 5న సాయంత్రం 4 గంటల నుంచి భక్తి గీతాలాపన, 5 గంటల నుంచి రామాయణ పాత్రల వేషధారణ, 6వ తేదీన సాయంత్రం 6 గంటలకు ప్రసాద వంటల పోటీలు నిర్వహించనున్నట్లు వివరించారు.

స్లీప్‌వెల్ నకిలీ స్టిక్స్ పట్టివేత.. కేసు నమోదు

కరీంనగర్ క్రైం, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): కరీంనగర్‌లోని గంజ్ ప్రాంతంలో రెండు దుకాణాల్లో విక్రయిస్తున్న నకిలీ స్లీప్‌వెల్ స్టిక్స్‌ను పట్టుకున్నట్లు వన్ టౌన్ సీఐ కోటేశ్వర్ తెలిపారు. అశికాస్ స్లీప్‌వెల్, ఇన్‌సెన్స్‌స్టిక్స్ కంపెనీ ప్రతినిధి ఫిర్యాదుతో గంజ్ ప్రాంతంలోని శ్రీకృష్ణ జనరల్ స్టోర్స్, దేవి జనరల్ స్టోర్‌లో గురువారం దాడులు నిర్వహించినట్లు పేర్కొన్నారు. స్టిక్స్‌ను స్వాధీనం చేసుకొని బాధ్యులపై కేసు నమోదు చేశామని తెలిపారు.

రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవాలి



రేకుర్తిలో ప్రతిజ్ఞ చేస్తున్న సుడా చైర్మన్ నరేందర్‌రెడ్డి, నాయకులు

భగత్‌నగర్, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవాలని సుడా చైర్మన్, నగర కాంగ్రెస్ అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి అన్నారు. నగరంలోని రేకుర్తి, విద్యానగర్‌లో రాజ్యాంగ పరిరక్షణ యాత్ర చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహాత్మా గాంధీ ప్రాధాన్యం తగ్గించే విధంగానూ, అంబేద్కర్‌ను అవమానపరిచే విధంగానూ పార్లమెంట్‌లో కేంద్ర హోం మంత్రి అమిత్‌షా వ్యాఖ్యలు చేయడం బాధాకరమన్నారు. అంతకు ముందు రేకుర్తి మెయిన్‌రోడ్డు నుంచి 17, 18, 19, 20,39వ డివిజన్ల మీదుగా యాత్ర సాగింది. కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి పురమల్ల శ్రీనివాస్, ఎస్టీ సెల్ అధ్యక్షుడు శ్రవణ్‌నాయక్, ఎస్సీ సెల్ కొరివి అరుణ్‌కుమార్, బాలబద్రి శంకర్, జక్కుల మల్లేశం, బోనాల శ్రీనివాస్, చాంద్ బబ్లు వర్మ, నర్సగౌడ్, వరాల నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

కరీంనగర్‌రూరల్: రాజ్యాంగం పరిరక్షణకు నడుంబిగించాలని కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి పురమల్ల శ్రీనివాస్ అన్నారు. గురువారం కరీంనగర్ రూరల్ మండలం ఫకీర్‌పేట్‌లో రాజ్యాంగ పరిరక్షణ యాత్ర చేపట్టారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సాయిని తిరుపతి, మండల అధ్యక్షుడు కాంరెడ్డి రాంరెడ్డి, రవీందర్‌రావు పాల్గొన్నారు.

హుజూరాబాద్‌రూరల్/సైదాపూర్/ఇల్లందకుంట/మానకొండూర్/తిమ్మాపూర్ : మండలాల్లోని గ్రామాల్లో జై బాపు జైభీం, జై సంవిధాన్ కార్యక్రమంలో భాగంగా భారత రాజ్యాంగాన్ని పరిరక్షించాలంటూ గురువారం కాంగ్రెస్ నాయకులు పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారత రాజ్యాంగాన్ని బీజేపీ ప్రభుత్వం అపహాస్యం చేస్తోందన్నారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



వెంకట్రావ్‌పల్లెలో రాజ్యాంగ పరిరక్షణ యాత్రలో నాయకులు

క్రీడల అభివృద్ధిలో పోలీసు శాఖ భాగస్వామ్యం

కరీంనగర్ స్పోర్ట్స్, ఏప్రిల్ 3 (ఆంధ్ర జ్యోతి): జిల్లా క్రీడల అభివృద్ధిలో పోలీస్ శాఖ భాగస్వామ్యం కానున్నట్లు కరీంనగర్ సీపీ గౌస్ ఆలం తెలిపారు. కరీంనగర్ పోలీస్ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన ఆయనను ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఒలంపిక్ అసోసియేషన్ బాధ్యులు గురువారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సీపీని సన్మానించారు. అనంతరం సీపీ మాట్లాడుతూ క్రీడారంగంలో కరీంనగర్‌కు విశిష్ట స్థానం ఉందని, జిల్లాలోని యువతను క్రీడరంగం పట్ల ప్రోత్సహిస్తామని తెలిపారు. అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి, తెలంగాణ జూడో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి గసిరెడ్డి జనార్దన్ రెడ్డి, ఉపాధ్యక్షులు కడారి అనంతరెడ్డి, తుమ్మల రమేశ్ రెడ్డి, కోశాధికారి సిద్ధారెడ్డి, సంయుక్త కార్యదర్శి నిరంజనాచారి, సభ్యుడు కన్న కృష్ణ పాల్గొన్నారు.



సీపీ గౌస్ ఆలంను సన్మానిస్తున్న క్రీడా సంఘాల బాధ్యులు

పంచాయతీ కార్మికుల సమ్మె నోటీసు

భగత్‌నగర్, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ వర్కర్స్ యూనియన్ సీఐటీయూ అనుబంధం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో గురువారం జిల్లా పంచాయతీ అధికారి జగదీశ్వర్‌కు నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఏప్రిల్ 19 తర్వాత జిల్లా వ్యాప్తంగా సమ్మె చేయనున్నట్లు ప్రకటించారు. కార్మికులకు ప్రతీ నెల వేతనాలు ఇవ్వకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారని, గ్రీన్ ఛానల్ ద్వారా 10వ తేదీలోగా అందించాలని డిమాండ్ చేశారు. యూనియన్ జిల్లా అధ్యక్షుడు మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

రేపు జగ్జీవన్‌రామ్ జయంతి

సుభాష్‌నగర్, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బాబు జగ్జీవన్‌రామ్ 118వ జయంత్యుత్సవాలను శనివారం నిర్వహించనున్నట్లు కలెక్టర్ పమేలా సత్పతి ప్రకటనలో తెలిపారు. నగరంలోని మంచిర్యాల చౌరస్తాలో జగ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద నిర్వహించే కార్యక్రమానికి ఎంపీ, ఎమ్మెల్యేలు, జిల్లా మేజిస్ట్రేట్, పోలీసు కమిషనర్, అడిషనల్ కలెక్టర్లు, జిల్లా ఉన్నతాధికారులు, దళిత నాయకులు, సంఘాలు హాజరుకావాలని కోరారు. విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించాలని కోరారు.

ఒలింపియాడ్‌లో అల్ఫోర్స్ విద్యార్థుల ప్రతిభ

భగత్‌నగర్, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): జోనల్ స్థాయి ఇన్ఫర్మేటిక్స్ ఒలింపియాడ్‌లో అల్ఫోర్స్ విద్యార్థులు బంగారు, రజత పతకాలు సాధించారు. గురువారం కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఇ-టెక్నో పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పతకాలు సాధించిన విద్యార్థులు లిఖిత్‌కుమార్, ఇ.సుహాన్‌ను విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి.నరేందర్‌రెడ్డి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇన్ఫర్మేటిక్స్ అంశానికి పోటీ ప్రపంచంలో చాలా ప్రాముఖ్యం ఉందన్నారు. ఇన్ఫర్మేటిక్స్ అంశం ద్వారా సమాజంలో విప్లవాత్మక మార్పులు చోటు చేసుకుంటాయన్నారు.



విద్యార్థులను అభినందిస్తున్న అల్ఫోర్స్ అధినేత నరేందర్‌రెడ్డి

బీజేపీ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలి

భగత్‌నగర్, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): బీజేపీ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి పిలుపునిచ్చారు. గురువారం నగరంలోని రేకుర్తిలో ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాలులో పార్టీ ఆవిర్భావ దినోత్సవ సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 6వ తేదీన పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా అన్ని పోలింగ్ బూత్‌లతోపాటు, ప్రతీ కార్యకర్త ఇంటిపై బీజేపీ జెండాను ఎగురవేయాలన్నారు. 12వ తేదీ వరకు నిర్వహించనున్న పార్టీ కార్యక్రమాలను విజయవంతం చేయాలన్నారు. క్రియాశీల సమ్మేళనాలు, గావ్ చలో, బస్తీ చలో అబియాన్ వంటి కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. మాజీ ఎమ్మెల్యే బొడిగె శోభ, మాజీ మేయర్ యాదగిరి సునీల్‌రావు, సీనియర్ నాయకులు, ప్రోగ్రాం కన్వీనర్ కన్నబోయిన ఓదెలు, కో-కన్వీనర్ ఓదెలు, వైద రామానుజం తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి

గంజ్ హైస్కూల్ సమస్యల పరిష్కారానికి కృషి

కరీంనగర్ టౌన్, ఏప్రిల్ 3 (ఆంధ్ర జ్యోతి): నగరంలోని గంజ్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని మాజీ మేయర్, బీజేపీ నేత యాదగిరి సునీల్‌రావు అన్నారు. స్థానిక ఎంపీ, కేంద్ర హోం శాఖ సహాయమంత్రి బండి సంజయ్ కుమార్ సూచన మేరకు బుధవారం సునీల్ రావు పాఠశాలను సందర్శించారు. విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పురాతనమైన ఈ పాఠశాలలో చదువుకున్న అనేక మంది వివిధ రంగాల్లో ఉన్నత హోదాలకు వెళ్లారని, పాఠశాల ఎంతో మందికి ఉన్నత భవిష్యత్‌ను అందించిందని అన్నారు.

సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన

కరీంనగర్ అర్బన్, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): నగరపాలక సంస్థ పరిధిలోని 5వ డివిజన్ సాయినగర్‌లో సీసీరోడ్డు నిర్మాణ పనులకు సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి గురువారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ.10 లక్షల సుడా నిధులతో పనులు చేపడుతున్నట్లు చెప్పారు. మాజీ కార్పొరేటర్ పిట్టల వినోద శ్రీనివాస్, డీఈ రాజేంద్రప్రసాద్, ఏఈ సతీష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

గణేశ్‌నగర్,ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): నగరంలో చెట్ల కొమ్మల తొలగింపులో భాగంగా శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి 11:30 వరకు వివిధ ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు టౌన్ టు ఏడీఈ లావణ్య తెలిపారు. మహాలక్ష్మినగర్, శ్రీనివాస్ నగర్, జయశంకర్ కాలనీ, శాతవాహన ఫార్మా మెడికల్ కళాశాల, చర్చి ఏరియాలో విద్యుత్ అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు.

గ్రూప్ వన్ ర్యాంకర్‌కు సన్మానం

భగత్‌నగర్, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): గ్రూప్ వన్‌లో ర్యాంక్ సాధించిన కన్నం హరిణిని విద్యానగర్‌కు చెందిన ఉపాధ్యాయులు గురువారం సన్మానించారు. విద్యానగర్‌కు చెందిన ఉపాధ్యాయులు కన్నం రమేష్, జ్యోతి దంపతుల కూతురు హరిణి గ్రూప్ వన్ ఫలితాల్లో 55 ర్యాంకు సాధించారు. కార్యక్రమంలో పీఆర్టీయూ రాష్ట్ర నాయకులు మానువాడ శంకర్, దొమ్మాట కరుణాకర్‌రెడ్డి, విశ్రాంత ఉపాధ్యాయుడు పర్శరాములు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వం తీరుపై పెన్షనర్ల ధర్నా



బీఎస్ఎన్ఎల్ ఎక్స్ఛేంజ్ ఎదుట ధర్నా చేస్తున్న పెన్షనర్లు

సుభాష్‌నగర్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): కేంద్ర పౌరసేవల సవరణలు-ఆర్థిక బిల్లు 2025కు వ్యతిరేకంగా బీఎస్ఎన్ఎల్ ఎక్స్ఛేంజ్ ఎదుట పెన్షనర్లు గురువారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు చందుపట్ల జనార్దన్, బీఎస్ఎన్ఎల్ పెన్షనర్స్ సంఘం జిల్లా అధ్యక్షుడు చక్రపాణి మాట్లాడుతూ పెన్షనర్స్ హక్కులకు భంగం కలిగే విధంగా కేంద్ర ప్రభుత్వం చట్టాన్ని తీసుకురావడం సరికాదన్నారు. కార్యక్రమంలో గడ్డం అశోక్, కట్ట నాగభూషణాచారి, మోకిలా రాజేందర్, దామెర మల్లయ్య, పుల్లెల మల్లయ్య, బీఎస్ఎన్ఎల్, పోస్టాఫీసు సంఘం నాయకులు పాల్గొన్నారు.

సైన్స్ మ్యూజియాన్ని సందర్శించిన వింధ్యావాలీ విద్యార్థులు

కరీంనగర్ స్పోర్ట్స్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని మెహర్‌నగర్ వింధ్యావాలీ పాఠశాల విద్యార్థులు గురువారం సైన్స్ మ్యూజియంను సందర్శించారు. విద్యార్థుల్లో శాస్త్రసాంకేతిక అంశాలపై ఆసక్తి పెంచి శాస్త్రవేత్తలుగా తీర్చిదిద్దాలని జిల్లా విద్యాశాఖ సంకల్పించింది. ఇందులో భాగంగా చేపట్టిన 'శాస్త్రవేత్తగా ఒక రోజు' కార్యక్రమంలో పాఠశాల విద్యార్థులు సైన్స్ మ్యూజియంను సందర్శించారు. జిల్లా సైన్స్ అధికారి జైపాల్ రెడ్డి, సెక్టోరియల్ ఆఫీసర్ అశోక్ రెడ్డి, పాఠశాల చైర్మన్ రామవరం లక్ష్మీ ప్రకాశ్‌రావు, వైస్ చైర్మన్ ఆర్ పృథ్వీరావు, ప్రిన్సిపాల్ ప్రశాంత్ పాల్గొన్నారు.

జగ్జీవన్‌రామ్ జయంతి ఉత్సవ కమిటీ

సుభాష్‌నగర్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): బాబు జగ్జీవన్‌రాం 118వ జయంత్యుత్సవ కమిటీని గురువారం ఏర్పాటు చేశారు. చైర్మన్‌గా డాక్టర్ కవ్వంపెల్లి సత్యనారాయణ, కార్యనిర్వాహక అధ్యక్షుడిగా బోయినపల్లి చంద్రయ్య, సభాధ్యక్షుడిగా మేడి అంజయ్య వైస్ చైర్మన్లుగా గసకింటి కుమార్, గాలిపెల్లి కుమార్, తడ్కపెల్లి భారతి, షైసని మనోహర్, సాంబారి కొమురయ్య, గోష్కి అజయ్, ప్రధానకార్యదర్శులుగా జీడీ శ్యామ్, ఆడెపు నర్సయ్య, మారెంపల్లి లక్ష్మీనారాయణ, కళ్లికోట సమ్మయ్య, అక్కెనపల్లి కుమార్, కన్వీనర్లుగా లింగంపల్లి బాబు, తునికి సమ్మయ్య, మెరుగు శ్రీనివాస్, ఎలగందుల అనిల్, బొప్పదండి సత్యంతోపాటు కో కన్వీనర్లు, కోశాధి కారులను నియమించారు.

విద్యార్థి కుటుంబానికి ఆర్థిక సహాయం

గణేశ్‌నగర్, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): ఎస్ఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల బీఏ తృతీయ సంవత్సరం విద్యార్థి వాసాల అరవింద్ అకాల మృతికి సంతాపంగా గురువారం కళాశాలలో సమావేశం నిర్వహించారు. అధ్యాపకులు, విద్యార్థులు సేకరించిన రూ.28 వేల నగదును ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ రామకృష్ణ విద్యార్థి కుటుంబానికి అందజేశారు.

11న బార్ అసోసియేషన్ ఎన్నికలు

హుజూరాబాద్ లీగల్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ న్యాయవాదుల సంఘం ఎన్నికలు ఈనెల 11న జరగనున్నాయి. అధ్యక్ష పదవికి యతిపతి అరుణ్‌కుమార్, బండి కళాధర్, ప్రధాన కార్యదర్శిపదవికి బండి రమేష్, ఎర్రోళ్ల రమేష్, కామని సమ్మయ్య పోటీలో ఉన్నారు. కాగా ఉపాధ్యక్షుడిగా నూతన శ్రీనివాస్, సహాయ కార్యదర్శిగా పిట్టల రాజేష్, లైబ్రరీ కార్యదర్శిగా సీహెచ్ భానుకిరణ్, కోశాధికారిగా బాగోతం కుమారస్వామి, స్పోర్ట్స్ అండ్‌కల్చరల్ సెక్రెటరీగా ఇరుమండ్ల జయపాల్, సీనియర్ ఈసీ మెంబర్‌గా బండి రవీందర్, జూనియర్ ఈసీమెంబర్‌గా తునికిరవి, లేడీఈసీ మెంబర్‌గా శిరీష ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు అడ్‌హక్‌కమిటీసభ్యులు నల్ల భూమిరెడ్డి, కంకణాల అమరేందర్‌రెడ్డి, సీకే జేమ్స్, నక్క సత్యనారాయణ తెలిపారు.

ప్రశంసాపత్రం అందుకున్న జమ్మికుంట కమిషనర్ అయాజ్

జమ్మికుంట, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): ఆస్తిపన్నుల వసూళ్లలో రాష్ట్రస్థాయిలో ప్రథమస్థానంలో నిలిచిన జమ్మికుంట మున్సిపల్ కమిషనర్ మహమ్మద్ అయాజ్‌కు కమిషనర్‌అండ్‌డైరెక్టర్‌ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ (సీడీఎంఏ) శ్రీదేవి హైదరాబాద్‌లో గురువారం రాష్ట్రస్థాయి ప్రశంసాపత్రం అందజేశారు. ఎల్లప్పుడూ ఉత్తమ ప్రతిభ కనబరుస్తున్నందున అయాజ్ కన్సిస్టెంట్ అచీవర్ అవార్డు దక్కించుకున్నాడు. ఈ సందర్భంగా కమిషనర్ సహకరించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు.

రూ.7550 పలికిన పత్తి ధర

జమ్మికుంట, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట వ్యవసాయ మార్కెట్లో క్వింటాళ్ పత్తిధర రూ.7550పలికింది. గురువారం మార్కెట్‌యార్డుకు తొమ్మిదిమంది రైతులు 131క్వింటాళ్ల విడి పత్తి, నలుగురు రైతులు మూడు క్వింటాళ్ల గోనె సంచుల్లో విక్రయానికి తీసుకువచ్చారు. ప్రైవేట్ ట్రేడర్స్ బహిరంగ వేలం పాట ద్వార గరిష్ఠ ధర రూ.7550, కనిష్ఠ ధర రూ.6600 చెల్లించి పత్తి కొనుగోళ్లు చేపట్టారు.

మున్సిపల్ కమిషనర్‌కు అభినందనలు

చొప్పదండి, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): చొప్పదండి పట్టణంలో 84 శాతం ఆస్తి పన్ను వసూలు చేసినందుకు మున్సిపల్ కమిషనర్ నాగరాజును అభినందించారు. ఈ మేరకు హైదరాబాద్‌లో జరిగిన ఒక కార్యక్రమంలో మున్సిపల్ పరిపాలనశాఖ అధికారులు ప్రశంసా పత్రాన్ని అందజేశారు.

ఉపాధ్యాయుల బడిబాట

గంగాధర, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్యాబోధన జరుగుందని విద్యార్థులను చేర్పించాలని మల్లాపూర్ పాఠశాల ఉపాధ్యాయులు తల్లిదండ్రులను కోరారు. గురువారం మండలంలోని మల్లాపూర్ జడ్పీహెచ్‌ఎస్, ప్రాథమి కోన్నత పాఠశాల ఉపాధ్యాయులు ముందస్తుగా బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ప్రభుత్వ పాఠశాలల్లో జరుగుతున్న విద్యాబోధన, సౌకర్యాలపై విద్యార్థులకు, తల్లిదండ్రులకు వివరిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు.

మహనీయుల విగ్రహాల ఆవిష్కరణకు కృషి

తిమ్మాపూర్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో నెలకొల్పిన మహనీయుల విగ్రహాలను త్వరగా ఆవిష్కరించేలా ప్రభుత్వం కృషిచేస్తున్నట్లు ఎస్సీఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య తెలిపారు. కరీంనగర్ ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ సమావేశంలో పాల్గొనడానికి వచ్చిన బక్కి వెంకటయ్యను తిమ్మాపూర్ పొలిటికల్ జేఏసీ నాయకులు కలిసి విగ్రహాలను ఆవిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ ఢిల్లీలో ఉన్నారని వాళ్లు రాగానే మాట్లాడి ఆవిష్కరణ పనులు వేగవంతం చేస్తామన్నారు.

గ్రామీణ రోడ్లకు మహర్దశ

● తిమ్మాపూర్ మండలంలో రూ.15.25 కోట్ల నిధులతో నిర్మాణం

తిమ్మాపూర్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): గ్రామీణప్రాంతాల్లో రోడ్లను అభివృద్ధి చేసేందుకు రాష్ట్రప్రభుత్వం ప్రణాళికలు రూపొందించింది. మండలంలోని రోడ్లకు మహర్దశ పట్టనుంది. ఇందులో బీటీరోడ్లు, సీసీరోడ్లు ఉన్నాయి. ప్రభ్వుత్వం ప్రతి మండలకేంద్రం నుంచి జిల్లా కేంద్రానికి రెండు వరుసల రహదారి ఏర్పాటు చేస్తామని ఇదివరకే ప్రకటించింది. దానికి సంబంధించినిధులు మంజురయ్యాయి. మండలంలో రోడ్ల పరిస్థితిని గుర్తించిన ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి కావాల్సిన నిధులపై నివేదికను సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపించారు. మండలంలో 23గ్రామపంచాయతీలు ఉండగా 15.25 కోట్ల మేర రోడ్ల నిర్మాణానికి, మరమ్మతులకు ప్రభుత్వం నుంచి నిధులు మంజురయ్యాయి.



మహాత్మానగర్ గ్రామ పరిధిలో నిర్మించిన సీసీ రోడ్డు

● పనులు త్వరగా పూర్తిచేస్తాం

- సురేందర్‌రెడ్డి, పంచాయతీరాజ్ ఏఈ



రోడ్ల పనులను త్వరగా పూర్తిచేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం. కొన్ని పనులకు సంబంధించి టెండర్ల ప్రకియ పూర్తి కాగా, కొన్ని పనులకు టెండర్ల ప్రక్రియ కొనసాగుతోంది.

● నియోజకవర్గాన్ని ముందు వరుసలో నిలబెడతా..

- ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ



నియోజకవర్గంలో ఎక్కడ మట్టిరోడ్డు కనబడకుండా చేయడమే ధ్యేయం. రోడ్లతోపాటు ప్రజలకు ఎలాంటి సమస్యలున్నా పరిష్కరిస్తా. మానకొండూర్ నియోజకవర్గాన్ని అభివృద్ధిలో ముందువరుసలో నిలబెడతాం.

గ్రామాల్లో సన్నబియ్యం పంపిణీ ప్రారంభం



రామడుగులో సీఎం, ఎమ్మెల్యే చిత్రపటాలకు క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

రామడుగు/జమ్మికుంట రూరల్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్ని గ్రామాల్లో రేషన్‌షాపుల ద్వారా సన్నబియ్యం పంపిణీ కార్యక్రమాన్ని గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్‌పార్టీ నాయకులు, లబ్ధిదారులు సీఎం రేవంత్ రెడ్డి, స్థానికఎమ్మెల్యే మేడిపల్లి సత్యం చిత్రపటాలకు క్షీరాభిషేకం చేస్తూ సంబరాలు నిర్వహించారు.

వైభవంగా లక్ష్మీనృసింహస్వామి కల్యాణం

రామడుగు, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గోపాల్‌రావుపేటలో గురువారం శ్రీలక్ష్మీనృసింహస్వామి కల్యాణం అంగరంగ వైభవంగా జరిగింది. స్వామివారికి పట్టువస్త్రాలు, తలంబ్రాలు మోర భద్రేశం సమర్పించారు. వెంకటేశ్వర ఆలయం నుంచి ఎదుర్కోలు నిర్వహించారు. దాసరిబాబు-అనురాధ దంపతులు స్వామివారికి పుస్తెమట్టెలను బహూకరించారు. అనంతరం భక్తులు, మహిళలు ప్రత్యేకపూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు.

కాంగ్రెస్ నాయకుల ప్రచారం హాస్యాస్పదం

హుజూరాబాద్‌రూరల్/ఇల్లందకుంట, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): భారతరాజ్యాంగాన్ని పరిరక్షించాలంటూ కాంగ్రెస్‌నాయకులు చేపట్టిన ప్రచారం హాస్యాస్పదంగా ఉందని బీజేపీ జిల్లాకార్యదర్శి బింగి కరుణాకర్, సీనియర్ నాయకుడు మట్ట పవన్‌రెడ్డి అన్నారు. గురువారం హుజూరాబాద్, ఇల్లందకుంట మండలాల్లో వారు వేర్వేరుగా మాట్లాడుతూ కాంగ్రెస్‌పార్టీ రాజ్యాంగాన్ని రచించిన అంబేద్కర్‌ను ముందట పెట్టకుండా రాజ్యాంగంతో ఏ సంబంధం లేని గాంధీని పెట్టి ప్రచారాన్ని చేస్తోందన్నారు. రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ కేంద్రం ఇచ్చే 5కిలోల బియ్యానికి 1కిలో బియ్యం కలిపి ఇచ్చి మొత్తం వాళ్లే ఇస్తున్నట్లు ప్రచారం చేసుకోవడం సిగ్గుచేటన్నారు.హామీల నుంచి ప్రజల దృష్టిని మరలించేందుకే ఈ కార్యక్రమాలను చేపడుతోందని ఆరోపించారు.

మధ్యాహ్న భోజనానికి సహకారం అభినందనీయం

జమ్మికుంట, ఏప్రిల్ 3 (ఆంధ్ర జ్యోతి): ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులకు మధ్యాహ్న భోజనానికి దాతలు సహకరించడం అభినందనీయం అని రాష్ట్రకళాశాల, విద్యాశాఖ జాయింట్ డైరెక్టర్లు, ప్రొఫెసర్లు యాదగిరి, రాజేందర్ సింగ్, అకాడమిక్ గైడెన్స్ ఆఫీసర్, ప్రొఫెసర్ పి బాలభాస్కర్ అన్నారు. గురువారం దాతలు, కళాశాల పూర్వవిద్యార్థులు, కాటన్‌మిల్లర్స్ అసోసియేషన్ రాష్ట్రఉపాధ్యక్షుడు బచ్చు భాస్కర్, జిల్లాఅధ్యక్షుడు దొనకొండ మల్లారెడ్డి సహకారంతో కళాశాలలో మధ్యాహ్న భోజనం ప్రారంభించారు. దాతలు బచ్చుభాస్కర్ మాట్లాడుతూ కళాశాలకు తమవంతు సహాయసహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయన్నారు. అంతకు ముందు ఆయనను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలోప్రిన్సిపాల్ డాక్టర్ బి రమేష్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్ ఓదెలు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



బచ్చు భాస్కర్‌ను సన్మానిస్తున్న ప్రొఫెసర్లు, అధ్యాపకులు

అవీ.. ఇవీ..

సైదాపూర్: మండల కేంద్రంలోని కేరళ ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో ఓపెన్‌హౌస్ గ్రాడ్యుయేషన్ డేవేడుకను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈవో శ్రీనివాసరెడ్డి విద్యార్థులకు సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ సతీష్, ప్రిన్సిపాల్ అనగోనితిరుపతి, సింగిల్ విండో చైర్మన్‌కొత్తతిరుపతిరెడ్డి పాల్గొన్నారు.

వీణవంక: మండలంలోని నర్సింగాపూర్ గ్రామనికి చెందిన బుర్ర రవీందర్ ఇటీవల మృతి చెందగా వారి కుటుంబానికి అతిథి డేవలపర్స్ అధినేత కాంగ్రెస్‌నాయకుడు కొమ్మిడి రాకేష్‌రెడ్డి 50కేజీల బియ్యాన్ని అందించారు.

-మండలకేంద్రంలో శాలివాహన మండలకమిటీని గురువారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మందారపు నరేష్, ఉపాధ్యక్షులుగా కొలిశెట్టి మొండయ్య, నల్ల వెల్లి సంపత్, ప్రధానకార్యదర్శిగా తాటికంటి తిరుపతి, కార్యదర్శిగా ఇజ్జిగిరినరేష్, సిలివేరి విజయను ఎన్నుకున్నట్లు తెలిపారు.

శంకరపట్నం: పనిప్రదేశాల్లోఉన్న బడి ఈడుపిల్లలకి చదువుకునేందుకు అవసరమైన సామగ్రిని ఎంఈవో లక్ష్మినారాయణ గురువారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్ఎం సుభాష్, ఉపాధ్యాయులున్నారు.

హుజూరాబాద్: ప్రకృతిని పరిరక్షించడమే నిజమైన అభివృద్ధి అని రైతు, ప్రజా సంఘాలసమాఖ్య జాతీయ అధ్యక్షుడు పొలాడిరామారావు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. హైద్రాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలోని 400ఎకరాల్లో ఉన్న అటవీప్రాంతాన్ని అభివృద్ధి పేరుతో చెట్లను నరికి వేయాలనే ప్రయత్నాన్ని పాలకులు వెంటనే విరమించు కోవాలని తెలిపారు.

గన్నేరువరం: మండలంలోని వివిధ గ్రామాల్లో కాంగ్రెస్ కార్యకర్తలు ఇష్టం వచ్చినట్టుగా సీసీరోడ్లు నిర్మించడం తగదని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గంప వెంకన్న అన్నారు.

గంగాధర: మండలంలోని ర్యాలపల్లి అనుబంధ గ్రామం కుర్మపల్లిలో గురువారం దొడ్డి కొమురయ్య జయంతివేడుకలు నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు.

-మండలం కురిక్యాలకు చెందిన ఒగ్గరి ప్రశాంత్ ప్రమాదంలో మృతిచెందగా ఆయన కుటుంబాన్ని గురువారం ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం పరా మర్శించారు. ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకుని ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు.రూ.10వేల సాయం అందించారు.